# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 7

సోమవారం, 5 జూన్, 2023

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సవాలు విసిరిన మేథ్స్!

**హైదరాబాద్, జూన్ 4 (వాయిస్ టుడే):** ఐఐటీలు సహా మరికొన్ని ప్రతిష్ఠాత్మక ఇంజనీరింగ్ సంస్థల్లో ప్రవేశానికి ఉద్దేశించి ఆదివారం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఏమంత సులువుగా లేదన్న అభిప్రాయం వ్యక్తమైంది. మేథ్స్ సవాలు విసిరిందని కొందరు విద్యార్థులు చెప్పడం గమనార్హం. ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన రెండు సెషన్స్ మోడరేట్ నుంచి కష్టంగా ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. రెండు సెషన్స్‌లోనూ కొందరు విద్యార్థులు చెప్పిన దాని ప్రకారం ఫిజిక్స్ సులువుగా, కెమిస్ట్రీ మధ్యస్థంగా ఉండగా, మేథ్స్ సాపేక్షంగా కష్టంగా ఉంది. ప్రముఖ కోచింగ్ సంస్థ ఫిట్జీ విశ్లేషణ ప్రకారం ఒక్కోటి మూడు గంటల పేపర్. కాగా ఒక్కో సబ్జెక్టులో 60 చొప్పున మూడింటికి కలిపి 180 మార్కులకు ఇచ్చారు. ఒక్కో సబ్జెక్టులో 17 ప్రశ్నలు అడిగారు. మొత్తం 51 ప్రశ్నలు ఇచ్చారు. ప్రతి సబ్జెక్టులో నాలుగు సెక్షన్లు ఉన్నాయి. మూడో సెక్షన్‌కు 24 మార్కులు కేటాయించారు. మిగిలిన మూడు సెక్షన్లకు గానూ ఒక్కోదానిలో 12 చొప్పున 36 మార్కులకు ప్రశ్నలు అడిగారు.

## నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్



**హైదరాబాద్, జూన్ 4 (వాయిస్ టుడే):** రాష్ట్రంలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ప్రాక్టికల్స్ సోమవారం ప్రారంభమై, 9న ముగుస్తాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రాక్టికల్స్‌కు 1,500లోపు విద్యార్థులు హాజరుకానుండగా, వీరికోసం రాష్ట్రవ్యాప్తంగా 36 పరీక్షాకేంద్రాలను ఏర్పాటుచేశారు. ఈ నెల 21న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్, 22న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలున్నాయి. ఈ ఇంటర్నల్ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం

- మిగతా 2వ పేజీలో

## ఆడపిల్లలకు అత్యంత భద్రత ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ



**హైదరాబాద్, జూన్ 4 (వాయిస్ టుడే):** ఆడపిల్లలకు అత్యంత భద్రత ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆడపిల్లలు, మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన షీటీమ్స్ దేశంలో ఆదర్శంగా నిలిచాయన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై జరిగిన మహిళా సురక్షా సంబరాల కార్యక్రమానికి ఎమ్మెల్సీ కవిత, హోంమంత్రి మహమూద్ అలీ, మంత్రి సత్యవతి రాథోడ్, డీజీపీ

- మిగతా 2వ పేజీలో

## భక్తజన సంద్రం.. యాదగిరిక్షేత్రం



**యాదగిరిగుట్ట, జూన్ 4 (వాయిస్ టుడే):** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రం ఆదివారం భక్తజన సంద్రాన్ని తలపించింది. వేసవి సెలవులు కావడంతో భక్తులు పెద్దసంఖ్య లో నృసింహుడి దర్శనానికి వచ్చారు. స్వామివారి ధర్మదర్శనా నికి ఐదు గంటలు, ప్రత్యేక దర్శనానికి రెండు గంటల సమ యం పట్టిందని భక్తులు తెలిపారు. ఆలయ ఖజానాకు రూ. 54,84,992 ఆదాయం సమకూరినట్టు అధికారులు తెలి పారు. స్వామి వారిని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ అన్న పూర్ణ కుటుంబసమేతంగా

- మిగతా 2వ పేజీలో

## ఒంటికి నిప్పంటించుకుని మెడికో విద్యార్థిని ఆత్మహత్య



**ఖమ్మం, జూన్ 4 (వాయిస్ టుడే):** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కేఎంసి పీజీ వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్య ఘటన అందరికీ గుర్తుండే ఉంటుంది. సీనియర్ మెడికల్ విద్యార్థి సైఫ్ వేధింపులు భరించలేక.. ఇంజక్షన్ ద్వారా పాయిజన్ తీసుకొని ప్రీతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాదకర ఘటన మరవకముందే మరో మెడికో విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. ఖమ్మం, మమతా మెడికల్ కాలేజీకి చెందిన సముద్రాల మానస(22) అనే మెడికో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. హాస్టల్ గదిలో పెట్రోల్ పోసుకొని నిప్పటించుకుంది.

## 'మంచి ఫిగర్' అన్నా లైంగిక వేధింపే

**ముంబై, జూన్4:** తోటి మహిళా ఉద్యోగిని ఉద్దేశించి బ్యూటిఫుల్ ఫిగర్ అని కామెంట్లు చేయడం, బాగా మెయింటెయిన్ చేస్తున్నారనడం, బయటకు వెళ్దాం వస్తారా అని పిలవడం వంటివి అశ్లీల పదజాలం కిందకే వస్తాయని ముంబైలోని సెషన్స్ కోర్టు స్పష్టం చేసింది. ఇలాంటి మాటలు ఆమె గౌరవానికి భంగం కలిగించేవేనని తెలిపింది. అలాంటి వ్యాఖ్య లు చేసిన వారు ముందస్తు బెయిల్‌కు అర్హులు కారని, వారిని కస్టడీలోనే విచారించాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు జడ్జి ఎ.జడ్.ఖాన్ ఉత్తర్వులు ఇచ్చారు. ఓ రియల్టీ కంపెనీలో ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న మహిళ పట్ల అసిస్టెంట్ మేనేజర్(42), సేల్స్ మేనేజర్(30) ఇలాంటి కామెంట్లు చేయడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో వారు ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేయగా జడ్జి నిరాకరించారు. "ఈ కేసు లో పలు కోణాలున్నాయి. వారిని కస్టడీలోనే విచారించాల్సి ఉంటుంది. లేకుంటే దర్యాప్తు అధికారికి ఉండే విచారించే హక్కును లాగేసుకున్నట్టు అవుతుంది. చివరకు అది ప్రాసిక్యూషన్‌పై ప్రభావం చూపుతుంది"అని పేర్కొన్నారు. పనిస్థలంలో తోటి మహిళా ఉద్యోగిని వేధించడం తీవ్రమైన విషయమన్నారు.

# టార్గెట్ కాంగ్రెస్



- బీజేపీ విషయంలో మారిన కేసీఆర్ వైఖరి
- నిర్మల్ జిల్లా సభలో కాంగ్రెస్ పై విమర్శలు
- ఆ పార్టీని బంగాళాఖాతంలో వేయాలని ఫైర్
- కమలం పార్టీ పేరు కూడా ఎత్తని ముఖ్యమంత్రి
- కారణం తెలియక బీఆర్ఎస్ శ్రేణుల్లో అయోమయం

రాజకీయ చాణక్యుడిగా పేరు తెచ్చుకున్న సీఎం కేసీఆర్ మరోసారి ఎవరికీ అంతుచిక్కని వైఖరి ప్రదర్శించారు. చాన్స్ దొరికితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని తూర్పారబట్టే సీఎం.. ఆదివారం నిర్మల్ జిల్లలో జరిగిన బహిరంగ సభలో అందుకు విరుద్ధంగా వ్యవహరించారు. జిల్లా కలెక్టరేట్ భవనం, బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించేందుకు వెళ్లిన ముఖ్యమంత్రి అనంతరం సభలో తన ప్రసంగంలో బీజేపీ పేరును కూడా ప్రస్తావించలేదు.

**హైదరాబాద్, జూన్ 4 (వాయిస్ టుడే):** జాతీయ రాజకీయాలు లక్ష్యంగా బీజేపీపై విమర్శలు గుప్పించే కేసీఆర్ ఈ సందర్భంగా మాత్రం పల్లెత్తు మాట కూడా అనలేదు. పైగా కాంగ్రెస్ ను టార్గెట్ చేసి విమర్శనాస్త్రాలను సంధించారు. తెలంగాణ వెనకబాటుకు కారణం కాంగ్రెస్సేనని, 50 ఏళ్లు పరిపాలించి ప్రజలకు తాగు నీరు కూడా ఇవ్వలేకపోయిందని ఆరోపించారు. అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తామని కాంగ్రెస్ నేతలు అంటున్నారని, కానీ.. కాంగ్రెస్ పార్టీనే బంగాళాఖాతంలోకి విసిరేయాలని కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే.. రైతు బంధుకు రాం రాం.. దళితబంధుకు జై భీమ్ చెబుతారని హెచ్చరించారు. అలాంటి వారి మోసపూరిత మాటలు నమ్మవద్దన్నారు. గత ప్రభుత్వాల పాలనలో తెలంగాణ ప్రాంత ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని.. గందరగోళ పరిస్థితులు ఉండేవని చెప్పుకొచ్చారు కేసీఆర్. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న వేళ ఆ దుర్మార్గులు మళ్లీ ఓట్లు వేసి గెలిపించాలంటూ తిరుగుతున్నారంటూ చెప్పుకొచ్చిన కేసీఆర్.. వాళ్లు వస్తే రైతుబంధుకు రాం రాం.. దళితబంధుకు జై భీమ్ అనే పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. చెరువులన్నీ ఒకనాడు ఎండిపోయి ఆగమయ్యేవాళ్లమని.. కానీ ఇప్పుడు చెరువులన్ని కళకళలాడుతున్నాయన్నారు. ఎస్సారెస్పీ ద్వారా వచ్చే స్కీమ్ 27-28 ప్యాకేజీని త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. ఎస్సారెస్పీ ద్వారా నిర్మల్, ముధోల్

- మిగతా 2వ పేజీలో

# ప్రజాస్వామిక తెలంగాణే లక్ష్యం

### భువనగిరిలో అలయ్‌బలయ్‌లో వక్తలు



**భువనగిరి, జూన్ 4 (వాయిస్ టుడే):** 'జెండాలు, ఎజెండాలు, పార్టీలను పక్కన పెడదాం. అధికార అహంకారంతో విర్రవీగుతున్న సీఎం కేసీఆర్‌ను గద్దెదించే వరకూ పోరాడుదాం. అన్ని పార్టీలు ప్రజల ఎజెండాగా ముందుకు సాగాలి. కష్టపడి సాధించుకున్న తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు. కేవలం కేసీఆర్ కుటుంబ ఆకాంక్షలు మాత్రమే నెరవేరాయి.' అని వక్తలు పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమకారుడు, బీజేపీ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాకేంద్రంలో అలయ్-బలయ్ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ గాయని కోకిల బెల్లి లలితక్క ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు, ప్రముఖులు హాజరై, ఉద్యమ స్మృతులను గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఉండచ్చు కానీ, బహుజనుల రాజ్యంరావాలని, ధర్మం, న్యాయం, పేద ప్రజల సమస్యలకు పరిష్కారం కలిగే పాలన కావాలని కోరామని బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. రెండోసారి అధికారం ఇచ్చాక సీఎం కేసీఆర్‌కు కళ్లు నెత్తికెక్కి అసలు రూపం బయటపడిందన్నారు. అభివృద్ధి ఆత్మ గౌర వానికి ప్రత్యామ్నాయం కాదని, ఉమ్మడి రాష్ట్రంలోనే చెప్పామన్నారు. కేసీఆర్ చెప్పే అభివృద్ధి కాదు కావాల్సిందని, స్వేచ్ఛ ప్రజా సౌమ్య పాలనకావాలన్నారు. పాట ప్రజల పక్షాన

- మిగతా 2వ పేజీలో

## అమిత్ షా, నడ్డాను చంద్రబాబు కలిస్తే తప్పేంటి..?

### తెలంగాణలో బలపడుతున్నాం: సంజయ్



**హైదరాబాద్, జూన్ 4 (వాయిస్ టుడే):** కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలను ఏపీ మాజీ సీఎం చంద్రబాబు కలిస్తే తప్పేముందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రశ్నించారు. టీడీపీతో బీజేపీ పొత్తుకు సిద్ధమైందని వచ్చిన వార్తలు ఊహాగానాలేనని కొట్టిపారేశారు. దేశ, రాష్ట్రాల అభివృద్ధి కోసం గతంలో మమతా బెనర్జీ, స్టాలిన్, నితీశ్ కుమార్ వంటి ప్రతిపక్ష నేతలను ప్రధాని మోదీ, అమిత్ షా కలిశారని గుర్తు చేశారు. ఆదివారం వివిధ జిల్లాల నేతలతో బండి సంజయ్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేసీఆర్‌లా -2లో

## రైతులను దగా చేసినందుకా ఈ ఉత్సవం?: షర్మిల



**హైదరాబాద్, జూన్ 4 (వాయిస్ టుడే):** రైతులను నిండా ముంచి, ఓట్ల కోసం రైతు దినోత్సవం నిర్వహించిన సీఎం కేసీఆర్‌కు చెంప చెళ్లుమనేలా వారు సమాధానం ఇచ్చారని షర్మిల అన్నారు. రైతు దినోత్సవం అనడం కంటే రైతుదగా దినోత్సవమంటేనే కేసీఆర్‌కు సూటవుతుందని ఆదివారం -2లో

# కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్ మృతి..



ఒడిశా ఘోర రైలు ప్రమాద ఘటనలో మృతుల సంఖ్య 290కి చేరింది. వందల సంఖ్యలో క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్ జి మొహంతి చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే ప్రమాదానికి కారణం కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్ కారణమని మొదట వార్తలొచ్చాయి. విచారణ చేపట్టిన రైల్వే బోర్డు ఘటనకు ఆయన కారణం కాదని, గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తర్వాతే రైలును ముందుకు నడిపాడని క్లీన్ చీట్ ఇచ్చింది. ఈ ప్రమాదంలో లోకోపైలట్ జి మొహంతి రెండు కాళ్లు తెగిపడ్డాయి. భువనేశ్వర్‌లో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మొహంతి ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. కాగా అసిస్టెంట్ లోకోపైలట్ ఐసీయూలో ప్రాణాలతో పోరాడుతున్నాడు. లోకో పైలట్ మృతితో డేటా లాగర్ సిమ్యులేషన్ సాక్ష్యంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రమాదానికి గురైన మరో రెండు రైళ్లలోని లోకో పైలట్లు సురక్షితంగా ఉన్నారు.

కాగా.. ప్రమాద ఘటనపై సోషల్ మీడియాలో ఆడియో వైరల్ కావడం సంచలనంగా మారింది. ఇద్దరు రైల్వే అధికారుల మధ్య జరిగిన సంభాషణ ఆ ఆడియోలో ఉంది. సౌత్ ఈస్టర్న్ రైల్వేలో ట్రాఫిక్ సీఎస్‌వోగా అశోక్ అగర్వాల వాయిస్‌తో ప్రమాద ఘటనకు సంబంధించిన సంచలన విషయాలు ఈ ఆడియో ద్వారా

- మిగతా 2వ పేజీలో

## బీజేపీని దించేస్తాం: రాహుల్ జోస్యం



**వాషింగ్టన్/న్యూఢిల్లీ, జూన్ 4:** వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఆశ్చర్యకరమైన ఫలితాలు వస్తాయని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ చెప్పారు. ప్రతిపక్షాలు ఐకమత్యంతో బీజేపీని గద్దె దించుతాయని ప్రకటించారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన.. వాషింగ్టన్‌లోని నేషనల్ ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరులతో -2లో

## శాంతి భద్రతల పరిరక్షణకు కృషి



**సూర్యాపేటక్రైం, జూన్ 4:** ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీషరెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ ఎస్. రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన సురక్ష దినోత్సవ ర్యాలీని ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, కలెక్టర్ ఎస్. వెంకట్రావ్, ఎమ్మెల్యేలు డాక్టర్ గాదరి కిశోర్‌కుమార్, బొల్లం మల్లయ్యయాదవ్ కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం పాత వ్యవసాయ మార్కెట్ ప్రదేశంలో ఏర్పాటు చేసిన సమావేశంలో -2లో

# ప్రమాదం కాదు.. కుట్రే!

- సీబీఐ దర్యాప్తు చేయిస్తాం
- ఇంటర్ లాకింగ్ వ్యవస్థను మార్చడం వల్లే..
- పాయింట్ మెషిన్ సెట్టింగ్‌లు మార్చేశారు
- ఈ నేరం వెనుక ఉన్న వారిని గుర్తించాం
- త్వరలోనే వారిపై చర్యలు తీసుకుంటాం
- 'సేఫ్టీ' నివేదిక రాగానే మరిన్ని వివరాలు
- ఇలాంటివి కవచ్ అడ్డుకోలేదు: రైల్వే మంత్రి
- సిగ్నలింగ్ సమస్యే కారణం: రైల్వే బోర్డు



**బాలాసోర్, భువనేశ్వర్, జూన్ 4:** ఒడిసాలోని బాలాసోర్ జిల్లా బహానగ వద్ద జరిగిన రైలు ప్రమాద ఘటనపై రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ సంచలన ఆరోపణలు చేశారు. ఇది ప్రమాదం కాదని, సిగ్నలింగ్ వ్యవస్థలో మార్పుల వల్లే ఈ ఘోరం జరిగిందని అన్నారు. దీనిలో కుట్ర కోణం ఉండొచ్చని పరోక్షంగా స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ వ్యవస్థను మార్చడమే ప్రమాదానికి కారణమని చెప్పారు. పాయింట్ మెషిన్ సెట్టింగ్‌లు ఎవరో

- మిగతా 2వ పేజీలో




## నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

(మొదటి పేజీ తరువాయి)

ఒంటిగంట వరకు నిర్వహిస్తారు.

**12 నుంచి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ:** ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 12 నుంచి 20 వరకు జరుగనున్నాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో నిర్వహించే ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 933 పరీక్షాకేంద్రాలను ఏర్పాటుచేశారు. ఫస్టియర్ నుంచి 2,70,503 మంది విద్యార్థులు, సెకండియర్ నుంచి 1,41,501 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. హాల్‌టికెట్లను రెండు మూడు రోజుల్లో వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని అధికారులు వెల్లడించారు.

## ఆడపిల్లలకు అత్యంత భద్రత ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

అంజనీకుమార్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి, సినీ నటుడు నాని, విమెన్ సేఫ్టీ వింగ్ షీటీమ్ ఇన్‌చార్జి శిఖాగోయల్, ప్రముఖ క్రీడాకారిణి నైనా జైశ్వాల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ పోలీసు విమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కవిత ప్రారంభించారు. అనంతరం కవిత మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడినప్పుడు భద్రతపై అనేక అపోహలు ఉండేవని, అయితే శాంతిభద్రతల కోసం తగిన చర్యలు చేపట్టిన ఘనత సీఎందేనని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడైనా అర్ధరాత్రి ఆడబిడ్డలు ఒంటరిగా నడిచి వెళ్లే రోజులున్నాయని తెలిపారు. హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కృషితో పోలీసు శాఖ దేశంలోనే మొదటిస్థానంలో ఉందని, పోలీసు శాఖలో నూతన టెక్నాలజీని వాడుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. మంత్రి సత్యవతి రా?థోడ్ మాట్లాడుతూ.. మహిళల భద్రత, రక్షణ పట్ల రాష్ట్రప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని, షీటీమ్స్ దేశంలోనే ఆదర్శంగా నిలిచాయన్నారు.

## భక్తజన సంద్రం.. యాదగిరిక్షేత్రం

(మొదటి పేజీ తరువాయి)

దర్శించుకున్నారు. ప్రధాన ఆలయంలో వినియోగించేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ఆధ్వర్యంలో 3 బ్యాటరీ వాహనాలను విరాళంగా అందజేయనున్నారు. వీటిని ఎస్‌బీఐ చైర్మన్ దినేష్ ఖరా అందజేస్తారని బ్యాంకు సిబ్బంది తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కొండపైన ఆలయ ఘాట్‌రోడ్‌లోని తెలంగాణ టూరిజం(హరిత కాటేజ్) ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఘాట్ రోడ్‌లోని హరిత కాటేజ్ భవనం గోడలపై జాతీయ పతాకం (త్రివర్ణ) మూడు రంగుల్లో కనిపించేలా విద్యుద్దీపాలతో అలంకరించారు.

## టార్గెట్ కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాలకు లక్ష ఎకరాలకు నీరు రాబోతుందని కేసీఆర్ హామీ ఇచ్చారు. 8వ తేదీన గ్రామాల్లో చెరువు కట్టల మీద కోలాహలంగా పండుగ జరుపుకోవాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. కానీ, బీజేపీ గురించి మాత్రం ఒక్కమాట కూడా మాట్లాడలేదు. దీంతో కేసీఆర్ వైఖరి అక్కడికి భారీ సంఖ్యలో వచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలకు ఆశ్చర్యం కలిగించింది. గత కొన్నాళ్లుగా ఏ వేదిక మీదనుంచి మాట్లాడినా బీజేపీనే టార్గెట్ చేసుకునే కేసీఆర్ ఇంతలా ఎందుకు సైలెంట్ అయ్యాడోనని వారంతా అయోమయానికి గురయ్యారు. ఇప్పటికే తన కూతురు కవితను ఢిల్లీ మద్యం కుంభకోణం కేసు నుంచి కాపాడుకునేందుకు బీజేపీతో కేసీఆర్ రాజీ పడ్డారనే ప్రచారం జరుగుతోంది. తాజాగా నిర్మల్ లో ఆయన వైఖరి కూడా అందుకు తగ్గట్టుగానే ఉండడంతో శ్రేణుల్లో గందరగోళం ఏర్పడింది. బీజేపీతో ఘర్షణకు కేసీఆర్ ఫుల్ స్టాప్ పెడుతున్నారా?అన్న అనుమానాలు వ్యక్తమవుతునాయి. దీనికి ముమ్ముందు కేసీఆరే సమాధానం చెప్పాలి.

## అమిత్ షా, నడ్డాను బాబు కలిస్తే తప్పేంటి..?

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలను, ప్రతిపక్ష పార్టీలను కలవకుండా ప్రగతి భవన్‌కే పరిమితమై.. తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టే నైజం బీజేపీది కాదని పేర్కొన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో నెలాఖరు వరకు జరిగే 'మహాజన్ సంపర్క్ అభియాన్' కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణలో బీజేపీ గ్రాఫ్ పెరుగుతోందని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం, కమ్యూనిస్టు పార్టీలంతా కలిసే పోటీ చేయబోతున్నాయని వెల్లడించారు. ప్రజలు బీఆర్ఎస్ పాలన పట్ల విసిగిపోయారని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమని అన్నారు.

**ప్రజారోగ్యంపై రాజకీయమొద్దు: మాండవీయ**

ప్రజల ఆరోగ్యంపై రాజకీయాలు చేయడం తగదని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్సుక్ మాండవీయ.. సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. కేంద్రం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ కంటే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య శ్రీ పథకమే మేలని కేసీఆర్ చేసిన ప్రకటనపై కేంద్ర మంత్రి స్పందించారు. ప్రజల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం రెండు పథకాలను అమలు చేస్తే తప్పేముందని ప్రశ్నించారు. ఆదివారం మాదాపూర్‌లోని ఒక హొటల్‌లో మాండవీయ మాట్లాడారు. కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం నుంచి ఒక్క ప్రతిపాదన కూడా రాలేదని స్పష్టం చేశారు. రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతిపాదనలకు అనుగుణంగా రెండు దశల్లో కేంద్రం 157 మెడికల్ కాలేజీలను మంజూరు చేసిందని చెప్పారు. వీటిలో 98కాలేజీల నిర్మాణం పూర్తయిందని చెప్పారు. ప్రతీ కాలేజీకి అనుబంధంగా నర్సింగ్ కాలేజీలు కూడా ఏర్పాటు చేస్తున్నామని మాండవీయ పేర్కొన్నారు

## రైతులను దగా చేసినందుకా ఈ ఉత్సవం?: షర్మిల

(మొదటి పేజీ తరువాయి)

ట్విటర్‌లో వ్యాఖ్యానించారు. రుణమాఫీ, పంట నష్టపరిహారంపై రైతులు నిలదీస్తుంటే ఆయనకు సిగ్గనిపించట్లేదా అని ప్రశ్నించారు. అసలు ఏం సాధించారని రైతు దినోత్సవాలు నిర్వహిస్తున్నారన్నారు. రుణమాఫీ చేయకుండా, ఉచిత ఎరువులు ఇవ్వకుండా దగా చేసినందుకా... పంట బీమాకూ మోక్షం లేనందుకా అని నిలదీశారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయని, అది తెలంగాణ పోలీసుల కృషి అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నందున సుమారు 50వేల పరిశ్రమలు నెలకొల్పారని వివరించారు. ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ తెలంగాణ పోలీసులు శాంతిభద్రతలను పరిరక్షిస్తున్నారని కొనియాడారు. నిత్యం పగలు, ప్రతీకారాలతో తల్లడిల్లే గ్రామాల్లో సైతం నేడు ప్రశాంత వాతావరణం నెలకొందన్నారు. రాష్ట్రంలో షీటీమ్స్‌తో మహిళలకు సంపూర్ణ రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. సీఎం కేసీఆర్ తీసుకుంటున్న నిర్ణయాలను పోలీసులు ఖచ్చితంగా అమలు చేస్తున్నందునే తొమ్మిదేళ్లలో ఎక్కడ కూడా శాంతిభద్రతలకు విఘాతం కలగలేదన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూం దేశానికే దిక్సూచిగా మారిందన్నారు. దేశంలోనే తెలంగాణ పోలీస్ అద్భుత విజయాలు నమోదు చేస్తుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాసగౌడ్, జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, మునిసిపల్ వైస్ చైర్మన్ పుట్టా కిశోర్‌కుమార్, అధికారులు సుందరి కిరణ్‌కుమార్, జ్యోతి పద్మ, డీఎస్పీలు పరిక నాగభూషణం, మునిసిపల్ కమిషనర్, జిల్లాలోని పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదం కాదు.. కుట్రే!

(మొదటి పేజీ తరువాయి)

మార్చివేశారని ఆరోపించారు. అయితే వారిని ఇప్పటికే గుర్తించామని త్వరలోనే వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ ప్రమాదంపై సీబీఐ విచారణకు సిఫారసు చేశామని ఆయన వెల్లడించారు. ప్రమాద స్థలం వద్ద ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఘటనపై రైల్వే సేఫ్టీ కమిషనర్ దర్యాప్తు చేశారని, సమగ్ర నివేదిక రాగానే అన్ని విషయాలూ తెలుస్తాయని చెప్పారు. 'సంఘటనకు కారణం ఏమిటి.. దానికి బాధ్యులు ఎవరు అనే విషయాలు గుర్తించాం. ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ వ్యవస్థలో మార్పులు చోటుచేసుకున్నాయి. పాయింట్ మెషిన్ సెట్టింగ్‌లను ఎవరో మార్చివేశారు. ఈ నేరం వెనుక ఉన్న వారిపై చర్యలు తీసుకుంటాం' అని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. ప్రమాదంలో గాయపడి బాలాసోర్, కటక్, భువనేశ్వర్‌లోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా అండగా ఉంటుందని చెప్పారు.

**సిగ్నలింగ్‌లోనే సమస్య: రైల్వే బోర్డు**

కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి డ్రైవర్ తప్పిదం కారణం కాదని రైల్వే శాఖ తేల్చింది. ఈ ప్రమాదానికి అతివేగం కూడా కారణం కాదని పేర్కొంది. సిగ్నలింగ్ వ్యవస్థలో లోపం తలెత్తినట్టు ప్రాథమిక విచారణలో తేలిందని రైల్వే బోర్డు ఆపరేషన్, బిజినెస్ డెవలప్‌మెంట్ మెంబర్ జయ వర్మ సిన్హా ఆదివారం వెల్లడించారు. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ వల్ల మాత్రమే ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాద సమయంలో ఈ రైలు గంటకు 128 కి.మీ. వేగంతో వెళ్తోందని చెప్పారు. ఈ ఘోర ప్రమాదానికి దారితీసిన అంశాలను సిన్హా వివరించారు. "గూడ్సు రైలు పట్టాలు తప్పలేదు. లూప్‌లైన్‌లో ఐరన్ ఓర్ లోడ్‌తో ఆగిఉన్న గూడ్సు రైలుని బలంగా ఢీకొట్టడం వలన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌పై తీవ్ర ప్రభావం పడింది. ఎక్కువమంది చనిపోవడానికి, గాయాలపాలవడానికి



ఇదే ప్రధాన కారణం. ఈ క్రమంలోనే కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ బోగీలు చెల్లాచెదరై డౌన్‌లైన్‌లోకి వచ్చిపడ్డాయి. అదే సమయంలో డౌన్‌లైన్‌లో గంటకు 126 కి.మీ. వేగంతో వెళుతున్న హౌరా ఎక్స్‌ప్రెస్ చివరి రెండు బోగీలను ఢీకొట్టాయి' అని సిన్హా వివరించారు. ఈ రెండు రైళ్ల గరిష్ట వేగ పరిమితి గంటకు 130 కి.మీ. అని.. కాబట్టి ఇక్కడ అతివేగం ప్రమదానికి కారణం కాదని స్పష్టం చేశారు. 'కవచ్' ఉన్నప్పటికీ ఇలాంటి ప్రమాదాన్ని నివారించడంలో దోహదపడదని చెప్పారు. గూడ్స్ రైలు నిలిచి ఉన్న లూప్‌లైన్‌లోకి ప్రవేశించేందుకు గ్రీన్ సిగ్నల్ లభించడం వల్లే ప్రమాదం జరిగిందని రైల్వే అధికారులు వెల్లడించారు.

**నేడు, రేపు ఖరగ్‌పూర్‌లో విచారణ**

ప్రమాదంపై ఆగ్నేయ రైల్వేకు చెందిన సేఫ్టీ కమిషనర్ సోమ, మంగళవారాల్లో ఖరగ్‌పూర్‌లోని సౌత్ ఇనిస్టిట్యూట్‌లో బహిరంగ విచారణ చేపట్టనున్నారు. ఖరగ్‌పూర్‌లో నిర్వహించనున్న బహిరంగ విచారణకు ప్రయాణికులు, మృతులు/గాయపడినవారి కుటుంబ సభ్యులు, క్షతగాత్రులు, స్థానిక ప్రజలు హాజరు కావాలని రైల్వే శాఖ కోరింది.

### రైల్వే అధికారుల సంభాషణ ఆడియో సంచలనం

ప్రమాద ఘటనపై ఇద్దరు రైల్వే అధికారుల మధ్య జరిగిన సంభాషణకు సంబంధించిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ప్రమాద ఘటనపై నివేదిక విషయంలో అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆ ఇద్దరు రైల్వే అధికారులు మాట్లాడుకున్నారు. వారిలో సౌత్ ఈస్టన్ రైల్వేలో ట్రాఫిక్ సీఎస్‌వో కూడా ఉన్నారు. ఘటన జరిగిన తీరుకు నివేదిక కొంచెం విరుద్ధంగా ఉందని ఓ అధికారి అనుమానం వ్యక్తం చేయగా.. మరో అధికారి ఆ నివేదికలో స్పష్టత లేదని చెప్పారు. సిగ్నల్ మెయిన్ లైన్‌కు త్రూ చేశారు.. కానీ, పాయింట్ ఫేసింగ్ లూప్‌లైన్‌లో ఉంచారని, ఇదే ప్రమాదానికి కారణమని అధికారుల మధ్య సంభాషణ జరిగింది. ఎవరైనా కావాలనే చేస్తేనే అలా జరిగే అవకాశం ఉందని ఆ ఇద్దరి మాటల ద్వారా స్పష్టమైంది.

**3 నెలల క్రితమే హెచ్చరిక**

నైరుతి రైల్వే జోన్ చీఫ్ ఆపరేటింగ్ మేనేజర్ 3 నెలల క్రితమే వ్యవస్థలో తీవ్రమైన లోపాలున్నాయని హెచ్చరించారు. ఇంటర్ లాకింగ్ వ్యవస్థ వైఫల్యంపై ఫిబ్రవరిలో ఆందోళన వ్యక్తంచేసిన ఆయన భద్రతాపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఎత్తిచూపారు. దీనికి మరింత బలం చేకూరుస్తూ ఒడిసా రైలు దుర్ఘటనకు ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ వ్యవస్థలో మార్పులే కారణమని రైల్వే మంత్రి వెల్లడించారు.

**బాలాసోర్‌లో ప్రమాద స్థలంలో కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, ధర్మేంద్ర ప్రధాన్**

ఈ ప్రమాదంలో మృతిచెందిన వారి సంఖ్య 275గా ఒడిసా ప్రభుత్వం ప్రకటించింది. కొన్ని మృతదేహాలను రెండుసార్లు లెక్కించడం వల్ల తొలుత ఈ సంఖ్య 288గా ప్రకటించారని ఒడిసా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పీకే జెనా తెలిపారు. సమగ్ర పరిశీలన, బాలాసోర్ కలెక్టర్ నివేదిక తర్వాత మృతుల సంఖ్యను 275గా నిర్ధారించామని ఆయన పేర్కొన్నారు. ఇక గాయపడిన వారి సంఖ్యను 1.175గా నిర్ధారించామని చెప్పారు.

## బీజేపీని దించేస్తాం: రాహుల్ జోస్యం

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. భారతీయ అమెరికన్ ఫ్రాంక్ ఇస్లాం ఏర్పాటు చేసిన విందులోనూ ప్రసంగించారు.'చిన్న పాటి జోస్యం చెబుతున్నాను. వచ్చే 3-4 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ బీజేపీని ఓడించబోతోంది. ఆ రాష్ట్రాల ఫలితాలే 2024 ఫలితాలకు సూచికలు' అని తెలిపారు. అయితే దీనిపై భారతీయ మీడియాను ప్రశ్నిస్తే మాత్రం అలాంటిది జరగదని సమాధానం వస్తుందన్నారు. అది బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. 'బీజేపీ చేతుల్లో శబ్దం చేసే సాధనాలు ఉన్నాయి. అందుచేత వాళ్లు పెద్దగా అరవగలరు. కేకలు వేయగలరు.. వాస్తవాలను వక్రీకరించగలరు.. అందులో వారు సిద్ధహస్తులు. కానీ భారతీయ జనాభాలో అత్యధికుల మద్దతు వారికి లేదు' అని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ప్రధాని మోదీకి ఉన్న అత్యధిక ప్రజాదరణ గురించి ప్రస్తావించగా.. 'దేశంలోని వ్యవస్థలను స్వాధీనం చేసుకున్నారు. ప్రెస్‌ను కూడా కబ్జాచేశారు' అని రాహుల్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మతపరమైన మైనారిటీల హక్కుల రక్షణకు ఏయే కార్యక్రమాలు అమలు చేస్తారని అడుగగా.. 'భారత్‌లో దృఢమైన వ్యవస్థ ఉంది. కానీ దానిని బలహీనపరిచారు. ఒత్తిళ్లకు, నియంత్రణకు లోనుగాని స్వతంత్ర సంస్థలు ఉండాలి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మైనారిటీల హక్కులను త్వరగా పునరుద్ధరిస్తాం' అని బదులిచ్చారు. భారతీయ ప్రజాస్వామ్యం విశ్వమానవ సమాజానికి హితమైన దని.. అది పతనమైతే దాని ప్రభావం



ప్రపంచంపైనా ఉంటుందని చెప్పారు.

**ముస్లింలీగ్ సంపూర్ణ లౌకిక పార్టీ**

కేరళలోని తమ మిత్రపక్షం ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ (ఐయూఎంఎల్) లౌకికవాద పార్టీ అని రాహుల్ ప్రకటించారు. 'ముస్లింలీగ్ సంపూర్ణ లౌకికవాద పార్టీ. కాదు అనడానికి ఆస్కారం లేదు.. నన్ను ప్రశ్న అడిగిన వ్యక్తి ఆ పార్టీని సరిగా అధ్యయనం చేయలేదు' అని తెలిపారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై శుక్రవారం బీజేపీ, కాంగ్రెస్ మధ్య పరస్పర విమర్శలు సాగాయి. రాహుల్ ప్రకటన హానికరం, మోసపూరితమని బీజేపీ ఐటీ విభాగం ఇన్‌చార్జి అమిత్ మాలవీయ మండిపడ్డారు. 'తన మాజీ లోక్‌సభ స్థానం వయనాడ్‌లో గెలవడానికి ఇలా మాట్లాడడం ఆయనకు అవసరం. అందుకే జిన్నా ముస్లింలీగ్ సెక్యులర్ అని అన్నారు. భారత్‌ను మతప్రాతిపదికన విభజించడానికి కారణమైన పార్టీ రాహుల్‌గాంధీ దృష్టిలో సెక్యులర్ పార్టీ' అని ట్విటర్‌లో ఎద్దేవాచేశారు.

## ప్రజాస్వామిక తెలంగాణే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఉండొద్దని, ఉద్యోగాల పేరిట పాటను బందీ చేశారన్నారు. దశాబ్ది ఉత్సవాల పేరిట తెలంగాణ ప్రజల చెమట పెట్టి బిర్యానీలు పెట్టండి, దావతలు ఇవ్వండి, నా చరిత్ర చాటిచెప్పండి అని కలెక్టర్లను, అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశిస్తే.. వారు బానిసలుగా, గొర్రెల్లాగా తల ఊపి ఆ పని చేస్తున్నారని విమర్శించారు. తుఫాను వచ్చే ముందు సముద్రం ఎంత నిశ్చలంగా ఉంటుందో అంత నిశ్చలంగా తెలంగాణ గడ్డ ఉందని, తుఫాను తాకిడికి కేసీఆర్ ప్రభుత్వం కొట్టుకుపోక తప్పదన్నారు. భువనగిరి గడ్డమీద పాత యాది, పాత పోరాటాల గురించి చెబుతూ జిట్టా బాలకృష్ణారెడ్డి, ఏపూరి సోమన్నలను గుర్తుచేశారు.

**పాలనలో సీఎం కేసీఆర్ విఫలం – అద్దంకి దయాకర్, టీపీసీసీ అధికార ప్రతినిధి**

సీఎం కేసీఆర్ పరిపాలనకునిగా విఫలమయ్యారని అద్దంకి దయాకర్, టీపీసీసీ అధికార ప్రతినిధి అన్నారు. తెలంగాణ సంపదను దోచుకుని, అన్ని పార్టీలకు ఎన్నికల్లో ఖర్చు చేస్తామని ధరణితో విధ్వంసం చేస్తున్నాని తెలిపారు. తెలంగాణ కొత్త దిష్టిబొమ్మను తొలగిద్దాం, తెలంగాణ దొంగగా మారారని తెలిపారు. దోపిడీ దారుల పక్కన ఉన్న కేసీఆర్‌ను ప్రజలు గద్దెనెక్కిస్తే, వారి ఆకాంక్షలు నెరవేర్చకుండా దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. అన్ని పార్టీలు కూడా తెలంగాణ ఉద్యమకారులను గౌరవించాలన్నారు. సంక్షేమ పథకాలన్నీ కూడా సగం సగం వచ్చి అందరినీ మోసం చేశారని, కేసీఆర్‌ను బందు పెట్టే పనిచేయాలన్నారు.

**తెలంగాణ మోడలంటే అప్పు, సిప్పు, దప్పు– బూర నర్సయ్యగౌడ్, మాజీ ఎంపీ**

తెలంగాణ మోడలంటే అప్పు, సిప్పు, దప్పు అని భువనగిరి మాజీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. కేసీఆర్ పాలన నిరంకుశంగా ఉందని, రీజినల్‌రింగ్‌రోడ్డు భూములు కోల్పోతున్న రైతులపై కేసులు పెట్టారన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ ఇలాంటి కేసులు పెట్టలేదన్నారు. రీజినల్ రింగురోడ్డు ప్రతిపాదనలు యాదగిరిగుట్ట అవతల ఉండేదని, స్థానికంగా ప్రజాప్రతినిధుల స్వలాభం కోసం అలైన్‌మెంట్ మార్చాలరని తెలిపారు. పరిపాలనకు సంబంధించిన సచివాలయానికి గేట్లు వేసుకుంటున్నారని, ప్రజల డబ్బులతో కట్టి...వారికి అందుబాటులో ఉండకుండా ఎందుకని ప్రశ్నించారు.

**రక్తపుటేరులతో ఏర్పడిన తెలంగాణ ఉద్యమం పవిత్రమైంది – హర్యానా గవర్నర్, దత్తాత్రేయ**

తెలంగాణ ఉద్యమం పవిత్రమైందని హర్యానా గవర్నర్, బండారు దత్తాత్రేయ అన్నారు. ప్రజల సమస్యలపై పోరాటం చేసింది ఉద్యమకారులు, కళాకారులని వారికి సముచిత స్థానం దక్కాలన్నా రు. కళాకారులు, రాజకీయ నాయకుల సమన్వయంతోనే ఉద్యమం ఉధృత రూపం దాల్చిందని, వివిధ రాజకీయ పార్టీల అభిప్రాయాలు, సిద్ధాంతా లు ఏమైనా తెలంగాణ కోసం అంతా ఏకమయ్యారని గుర్తుచేశారు. తా ను బీజేపీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు శతృత్వం కంటే మితృత్వం గొప్పదని, ఒక వేదికపై అన్ని వర్గాలు, ఉద్యమకారులు రావలన్న ఆకాంక్షతో అలయ్‌బలయ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు.

**ప్రజల ఆకాంక్ష నెరవేర్చే వరకు ఉద్యమిస్తాం – జిట్టా బాలకృష్ణారెడ్డి**

ప్రజల ఆకాంక్ష నెరవేర్చే వరకూ ఉద్యమిస్తామని తెలంగాణ ఉద్యమకారుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి అన్నారు. స్వరాష్ట్రం ఏర్పడినప్పటికీ, ప్రజల, అమరుల ఆకాంక్ష నెరవేరలేదన్నారు. తెలంగాణ సాధిస్తే అన్ని సమస్యలను పరిష్కారం అవుతాయన్న ఉద్యమ సారధి, పాసిస్టు లక్షణాలతో పాలిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ కోసం ఎంతోమంది త్యాగాలు చేశారని, ప్రజలను చైతన్యం చేసేందుకు గానూ ఊరారా తిరిగి, ప్రజలను ఏకం చేశామని గుర్తు చేసుకున్నారు.

## సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల తీవ్ర అవస్థలు

**హైదరాబాద్, జూన్ 4 (వాయిస్ టుడే):** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కు ఒడిశా కోరమండల్ రైల్ ప్రమాదం ఎఫెక్ట్ తగిలింది. బాలాసోర్ జిల్లా లో జరిగిన రైలు ప్రమాదం కారణంగా రైల్వే అధికారులు 19 రైళ్లను రద్దు చేసి, 26 రైళ్లను దారి మళ్లించారు. ఒడిశా, బెంగాల్ వైపు వెళ్ళే రైళ్ల రద్దుతో సికింద్రాబాద్ నాంపల్లి రైల్వే స్టేషన్‌లో నిన్నటి నుండి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాక్ పునరుద్ధరణ జరుగుతున్న నేపథ్యంలో మరో రెండు రోజులపాటు రైళ్ల రద్దు ఉంటుందని తెలియవచ్చింది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో నిన్నటి నుంచి ప్రయాణికులు పడి గాపులుగాస్తున్నారు. రైళ్ల రద్దుతో సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు ప్రయాణీకులకు డబ్బు రిఫండ్ చేస్తున్నారు.

## 50 రైళ్లు రద్దు లికొన్ని దారి మళ్లింపు

**సికింద్రాబాద్, జూన్ 4 (వాయిస్ టుడే):** ఒడిశాలో రైలు ప్రమాదం జరగడంతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు దాదాపు 50 రైళ్లను రద్దు చేశారు. మరో 38 రైళ్లను దారి మళ్లించారు. హౌరా–బెంగళూరు, హౌరా–చెన్నై, హౌరా–తిరుపతి, హెూరా–సికింద్రాబాద్, హెూరా–హైదరాబాద్ రైళ్లు రద్దు అయ్యాయి. సికింద్రాబాద్–షాలిమార్, వాస్కోడిగామా–షాలిమార్ రైళ్లను కటక్, అంగోల్ మీదుగా దారి మళ్లించారు. చెన్నై సెంట్రల్–హౌరా ట్రైన్‌ను జరోలి మీదుగా, బెంగళూరు–గువాహటి రైలును విజయనగరం, టిట్లాగఢ్, జార్సుగుడా, టాటా మీదుగా నడుపుతు న్నారు. హౌరా–పూరీ, హౌరా–బెంగళూరు, హౌరా–చెన్నై మెయిల్, హౌరా–సంబల్‌పూర్, సంత్రగాచి–పూరీ, కన్యాకుమారి–హెూరా రైళ్లను రద్దు చేశారు. అలాగే..హౌరా–పూరీ ఎక్స్‌ప్రెస్, హౌరా–సర్ ఎం.విశ్వేశ్వరయ్య టెర్మినల్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్–హౌరా జన్‌శతాబ్ది ఎక్స్‌ప్రెస్, హౌరా–భువనేశ్వర్ జన్? శతాబ్ది ఎక్స్‌ప్రెస్, పూరీ–హౌరా శతాబ్ది ఎక్స్‌ప్రెస్, పూరీ–షాలిమార్‌ధౌలీ ఎక్స్‌ప్రెస్, పూరి–బంగిరిపోసి, బంగిరిపోసి–పూరి ఎక్స్‌ప్రెస్‌లు రద్దు అయ్యాయి.

**బాధితుల కోసం హెల్ప్ లైన్ నంబర్లు**

బాధిత ప్రయాణికుల కుటుంబసభ్యులకు సమాచారం అందించేందుకు దక్షిణ మధ్య రైల్వే వివిధ జంక్షన్లలో హెల్ప్‌లైన్ నెంబర్లను అందుబాటులోకి తెచ్చింది. విజయవాడ 0866 2576924, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో 040 27788516 హెల్ప్ లైన్ నంబర్ ఏర్పాటు చేసి బాధితుల సమాచారాన్ని అందిస్తున్నారు...

## హైదరాబాద్‌లో ఇద్దరు చిన్నారుల కిడ్నాప్

**హైదరాబాద్, జూన్ 4 (వాయిస్ టుడే):** సికింద్రాబాద్ మహాంకాళీ పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్నారి కిడ్నప్ కలకలం రేపింది. ప్యారడైస్ చౌరస్తా దాదూస్ స్వీట్ హౌజ్ ముందు ఫుట్ పాత్ పై నిద్రిస్తున్న కరిష్మా అనే 3 ఏళ్ల బాలికను గుర్తు తెలియని దుండగులు కిడ్నాప్ చేశారు. ఈ సంఘటన జూన్ 4వ తేదీ ఆదివారం తెల్లవారుజామున జరిగినట్లు తెలుస్తోంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రంగంలోకి దిగిన నార్త్ జోన్ టాస్క్ ఫోర్స్ బృందం, మహాంకాళీ ఏరియా పోలీసులు గంటల వ్యవధిలోనే చిన్నారి కిడ్నాప్ కేసు ను చేధించారు. కిడ్నాప్ కు పాల్పడిన మహిళతో పాటు ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. అయితే సుల్తాన్ బజార్ లో ఓ బాలుడ్ని కిడ్నాప్ చేసిన దుండగులు.. ప్యారడైస్ వద్ద చిన్నారిని కిడ్నాప్ చేసి ఆటోలో పారిపోతుండగా పట్టుకున్నారు పోలీసులు. ఇద్దరు చిన్నారులను క్షేమంగా పోలీస్ స్టేషన్ తరలించారు. కిడ్నాపర్స్ ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కర్నాటకకు చెందిన మేఘరాజ్ అనే వ్యక్తి భార్యా పిల్లలతో బతుకుదెరువు కోసం నగరానికి వచ్చాడు. ఫుట్ పాత్ పై నివసిస్తూ అక్కడే బెలూన్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మేఘరాజ్ కు ఏడుగురు సంతానం అందులో ఐదుగురు అమ్మాయిలు..ఇద్దరు అబ్బాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. రోజు మాదిరిగానే శనివారం బెలూన్లు అమ్ముకున్న మేఘరాజ్ రాత్రి పిల్లలతో ఫూట్ పాత్ పై నిద్రిస్తుండగా.. ఆటోలో వచ్చిన కిడ్నాపర్ప్ చిన్నారిని అపహరించారు. మేఘరాజ్ లేచి చూసే సరికి తన కూతురు కనిపించాలేదు. దీంతో కూతురిని ఎవరో కిడ్నాప్ చేశారని గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు...

# శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర గణనీయమైంది

**పీర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్ జక్కవెంకట్ రెడ్డి**

**రాష్ట్రప్రభుత్వం పదేండ్లలో పోలీస్ శాఖలో ఎన్నో మార్పులు**



**మేడిపల్లి,జూన్ 4 (వాయిస్ టుడే ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పోలీసు శాఖ - సురక్ష దినోత్సవం మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గొవర్ధన గిరి ఆధ్వర్యంలో మేడిపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సురక్ష దినోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పీర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్ జక్కవెంకట్ రెడ్డి,25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీరు జక్కా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ

ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం రాష్ట్రప్రభుత్వం కృషిచేస్తున్నదని,పదేండ్లలో పోలీసుశాఖలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. ఏదైనా నేరం జరిగిన సమయంలో పోలీసులు ఘటనాస్థలానికి వేగంగా చేరుకునేలా అవసరమైన నూతన వాహనాలను సమకూర్చారని, పోలీసులు అంటే ప్రజల్లో భయం వీడేలా ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థను తీసుకు వచ్చిన ఘనత కెసిఆర్ కి దక్కిందన్నారు. మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గొవర్ధన గిరి మాట్లాడుతూ పోలీసులు అంటే ప్రజలు భయపడవద్దని,ఫ్రెండ్లీ పోలీసుల వ్యవస్థను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని,మహిళలకు పోకిరీల బెడద నుంచి రక్షణ కల్పించేందుకు షీ టీములను ఏర్పాటుచేశారన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతోపాటు పోలీసులకు ఫుల్ పవర్స్ ఇచ్చి, పకడ్బందీ నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. సైబర్ నేరాలకు చెక్ పెట్టేలా నూతన టెక్నాలజీని తీసుకువచ్చారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం పదేండ్లలో పోలీసు వ్యవస్థలో చేపట్టిన మార్పులు, శాంతి భద్రతల పరిరక్షణకు అమలుచేస్తున్న విధి విధానాలు, సాధించిన విజయాలు, పోలీసువ్యవస్థలో వివిధ విభాగాల పనితీరు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారన్నారు. అనంతరం కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ వారు విడుదల చేసిన దేశంలోని అత్యుత్తమ 74 పోలీస్ స్టేషన్ల జాబితాలో మేడిపల్లి పోలీస్ స్టేషన్ ఉండటం మందరికి గర్వకారణమన్నారు. మీ చుట్టూ జరిగే అసాంఘిక కార్యక్రమాలు, సైబర్ నేరాలపట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అత్యవసర పరిస్థితుల్లో 100కి కాల్ చేయాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మద్ది యుగేందర్ రెడ్డి, సుమలత సత్యనారాయణ, కె. సుభాష్ నాయక్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సత్య ప్రసాద్, ఎస్ ఐ. కృష్ణయ్య, నాయకులు బండారు రవీందర్, బుచ్చియాదవ్, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## పోలీసులకు ప్రజలకు మధ్యన అవినాభావ సంబంధం ఉండాలి.. అప్పుడే శాంతిభద్రతలు మెరుగు

### ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి

**ఉప్పల్,జూన్ 4 (వాయిస్ టుడే ప్రతినిధి):** ఉప్పల్ డివిజన్లోని దేవేందర్ నగర్ క్వాటర్స్ లో ఏర్పాటుచేసిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ పోలీస్ ఆవిష్కరణలు - అవగాహన సదస్సు సురక్ష దినోత్సవనికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి హాజరయ్యారు. ఉప్పల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గోవింద రెడ్డి,అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పోలీస్ యంత్రాంగం పనితీరు దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు తీసుకువచ్చిన ఫ్రెండ్లీ పోలీస్ విధానంతో నేరాలు తగ్గాయి,సీసీ కెమెరాలు అన్ని ప్రధాన కూడలిలో కాలనీలో ఏర్పాటు చేయడం ద్వారా ఏదైనా అనుకోని సంఘటనలు జరిగినపుడు,నేరాలను చేదించడంలో పోలీసులు చాక చక్యంగా వ్యవహరిస్తూ ప్రముఖ పాత్ర వహిస్తున్నారని తెలిపారు. మల్కాజ్గిరి జోన్ ఏసీపి నరేష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ హాయంలో పోలీసు వ్యవస్థ ఎంతో మెరుగుపడిందని, శాంతి భద్రతల విషయంలో ప్రభుత్వానికి పటిష్టమైన ఆదేశాలు జారీ చేయడం,అందుకు అనుగుణంగా పోలీసులు వ్యవహరించడం సంతోషకరమన్నారు. ఉప్పల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గోవింద్ రెడ్డి మాట్లాడుతూ పోలీసులు, ప్రజలు అవినాభావ సంబంధంతో మెలుగాలని, అప్పుడే ప్రజల నుండి మరింత సమాచారం వచ్చి శాంతి భద్రతలను కాపాడేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ దశాబ్ది ఉత్సవాల ఇన్చార్జి ,డిప్యూటీ కమిషనర్ అరుణకుమారి,ఉప్పల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గోవిందా రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేందర్, టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు,పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## "డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్" జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకం..

**అంబేద్కర్ ఆశయ సాధన సంఘం ఉపాధ్యక్షుడు రాపోలు శ్రీరాములు**

**నత్తి మైసయ్య, చేపట్టిన జ్ఞానమాల కార్యక్రమం దేశానికి ఆదర్శం అయింది**

**మేడిపల్లి,జూన్ 4 (వాయిస్ టుడే ప్రతినిధి):** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సేవలను స్మరించుకుని నివాళులు అర్పిస్తున్న విషయం విధితమే.ఈ గొప్ప కార్యక్రమం 224 ఆదివారాలుగా విజయవంతంగా కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం ఉపాధ్యక్షుడు రాపోలు శ్రీరాములు మాట్లాడుతూ భారతదేశం ఉన్నంతకాలం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయంగా ఉంటాయని,అంబేద్కర్ ఆశయాలు,ఆకాంక్షలు నేటి యువతకు తెలియాలని దృఢ సంకల్పంతో ప్రతి ఆదివారం అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల అనే కార్యక్రమానికి నత్తి మైసయ్య శ్రీకారం చుట్టడం,అది 224 వారాలుగా విజయవంతంగా కొనసాగడం హర్షణీయ మని ఆయన అన్నారు. బోడుప్పల్ ప్రారంభమైన ఏ కార్యక్రమమైనా ఆదర్శవంతంగా స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని,అందుకు నిదర్శనమే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమం ప్రతి ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగడం చాలా సంతోషకరమని,ముఖ్యంగా నేటి యువత అంబేద్కర్ ఆశయాలు,ఆకాంక్షలు,ఆయన జీవిత చరిత్ర,తప్పనిసరిగా తెలుసుకోవాలని, ప్రతి భారతీయుడు రాజ్యాంగాన్ని చదవాలని విజ్ఞప్తి చేస్తున్నానని రాపోలు శ్రీరాములు అన్నారు. 224 వారాలుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవలను స్మరించడంలో రాష్ట్రవ్యాప్తంగా స్ఫూర్తిదాయకంగా నిలిచిన నత్తి మైసయ్యకు,అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులకి,మీడియా ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో కామగల బాబు,నత్తి విజయ్,ఈతకోట గోపాలకృష్ణ,బెక్కంశివ,జై భీమ్ అజయ్,ఈతకోట రమేష్,రాజు, తదితరులు పాల్గొన్నారు.

# అసైన్డ్ భూములపై ఉన్న ఆంక్షలను ఎత్తివేయాలి

**మంత్రి హరీష్ రావు అసైన్ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల వినతి**



**కూకట్ పల్లి:** తెలంగాణ రాష్ట్ర అసైన్ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు సభ్యులు రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మాత్యులు తన్నీరు హరీష్ రావుకు ఆదివారం వినతి పత్రాన్ని అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో అసైన్డ్ భూములపై ఉన్న ఆంక్షలు ఎత్తివేయాలని కోరారు. ప్రధానంగా ఆ భూములపై పూర్తి హక్కులు కల్పించాలని, ఈ విషయంపై తగు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి, మరియు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి లక్షలాది మంది పేద ప్రజల జీవితాలలో వెలుగులు నింపిన వారవుతారని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎర్రోళ్ల శివయ్య, మరియు తెలంగాణ రాష్ట్ర బీసీ వికాస సమితి రాష్ట్ర అధ్యక్షులు బాశెట్టి నర్సింగ్ రావు, తెలంగాణ యూత్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు బింగి రాములు, మరియు రాష్ట్ర కమిటీ సభ్యులు బాబురావు,మరియు కోహినూర్ సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ప్రజాధనం వృధా!

**అసెంబ్లీ బీజేపీ ఇంచార్జి మాధవరం కాంతారావు**



**కూకట్ పల్లి:** తెలంగాణ రాష్ట్రం భౌగోళికంగా ఏర్పాటయిందే తప్ప ప్రజలు కోరుకున్న సామాజిక, ఆర్థిక లక్ష్యాలు కేసీఆర్ పాలనలో నెరవేరలేదని కూకట్ పల్లి అసెంబ్లీ బీజేపీ ఇంచార్జి మాధవరం కాంతారావు విమర్శించారు. మరోసారి మోది సర్కార్ ఈసారి తెలంగాణలో బీజేపీ సర్కార్ అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను కేసీఆర్ పాలనా వైఫల్యాలను ప్రజలుకు వివరిస్తూ ఆదివారం కూకట్ పల్లి అసెంబ్లీ పరిధిలోని బోయినపల్లి డివిజన్ అంబేద్కర్ జంక్షన్, మందుల బస్తీ లైంస్టోన్ కాలనీలో నాల్గవ రోజు చేపట్టిన బీజేపీ భరోసా పాదయాత్రలో కూకట్ పల్లి అసెంబ్లీ బీజేపీ ఇంచార్జి మాధవరం కాంతారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ పాదయాత్రకు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని, ఎక్కడికక్కడ పేరుకుపోయిన స్థానిక సమస్యలను ప్రజలు వినతి పత్రాల రూపంలో మాకు అందజేస్తున్నారని తెలిపారు. ప్రజారంజక పాలన అందించడంలో బీఆర్ఎస్ పార్టీ విఫలమైందని, ఏదో సాధించినట్లు దశాబ్ది వేడుకలు నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చకుండా ప్రజల దృష్టిని మరల్చేందు కు ఇది జిమ్మిక్కులని ఆరోపించారు. కాగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వ హించేందుకు ప్రభుత్వం రూ.150 కోట్లను కూడా కేటాయించిందని, ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి డబ్బులు లేని తెలంగాణ ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ కోట్లాది రూపాయలతో దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటోందని ఆరోపించారు. బీఆర్ఎస్, ఎంఐఎం తోడు దొంగలని రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలైందని, బీఆర్ఎస్ పార్టీకి వీఆర్ఎస్ ఇవ్వడం ఖాయమని, అవినీతి రహిత పాలనను కోరుకుంటున్న తెలంగాణ ప్రజలు రానున్న ఎన్నికల్లో భారీ మెజారిటీతో బీజేపీని తప్పక గెలిపిస్తారని ఈ సందర్భంగా కాంతారావు ధీమా వ్యక్తం చేశారు. అనంతరం కూకట్ పల్లి అసెంబ్లీ బీజేపీ సీనియర్ నేత వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లా డుతూ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, ఆ మార్పు బిజెపితో నే సాధ్యమని, పాదయాత్రలో యువకులు స్వచ్ఛందంగా మాతో అడుగుల వేయడం మరింత నూతన ఉత్తేజాన్ని కలిగిస్తుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎన్ని కుతంత్రాలు చేసినా తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కేవలం భారతీయ జనతా పార్టీ మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సూర్యరావు, మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షులు హరీష్ రెడ్డి, కన్వీనర్ శ్రీకర్ రావు, బీజేపీ నేతలు సంతోష్, వినోద్, ధాకయ్య, మోర్చాల విభాగాలు, శక్తి కేంద్రం ఇంచార్జీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## జెడ్‌పిహెచ్‌ఎస్‌లో పోలీస్ సురక్ష దినోత్సవ కార్యక్రమం

### ముఖ్యఅతిథిగా మేడిపల్లి ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి గోవర్ధనగిరి

**మేడిపల్లి, జూన్ 5 ( వాయిస్ టుడే):** తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా, రాచకొండ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మేడిపల్లి పోలీసు వారు ఇన్స్పెక్టర్ గారి ఆధ్వర్యంలో " పోలీస్-సురక్ష దినోత్సవం" కార్యక్రమం జెడ్ పి హెచ్ ఎస్ మేడిపల్లి స్కూల్ క్రాంతి కాలనీ నందు నిర్వహించారు , ఈ సందర్భంగా కాంతి కాలనీ,సాయి నగర్, ఇంద్రప్రస్థ కాలనీ, గ్రీన్ హిల్స్ కాలనీ ప్రజలతో పోలీసు వారు మమేకమై తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించినప్పటి నుండి ప్రభుత్వం ఏ విధంగా మౌలిక సదుపాయాలు పోలీస్ శాఖకు కల్పించింది,ఇప్పటివరకు పోలీస్ శాఖ ఏ విధంగా ప్రజలకు చేరువయ్యింది, మమేకమయ్యింది,ఏ విధంగా ప్రజలకు సేవ చేసింది. మరెన్నో విప్లవత్మక మార్పుల ద్వారా భారత దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ అగ్రగామిగా దూసుకెళ్తూ ప్రజలకు, రాత్రి పగలు తేడా లేకుండా 24 గంటలు అందుబాటులో ఉంటూ డయల్ హండ్రెడ్ సి టీమ్స్ సైబర్ సేఫ్టీ మరియు సెక్యూరిటీ కంట్రోల్ వ్యవస్థ ద్వారా సీసీ కెమెరాస్ ద్వారా రక్షణ కల్పిస్తూ గత 9 ఏళ్లలో ఎంతో అద్భుతమైన ప్రగతిని, అభివృద్ధిని సాధించామని తెలియజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో మేడిపల్లి ఇన్స్పెక్టర్ గారు మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థ ధార ప్రజలకు అత్యంత చేరువయ్యామని, నేరాలను అదుపు చేయడంలో గాని,దోషులను శిక్షించడంలో కానీ ప్రథమ స్థానంలో ఉన్నామని తెలియజేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ గౌరవ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, మాట్లాడుతూ తెలంగాణలో పోలీసులు నిస్వార్థంగా సేవ చేస్తున్నారని, ప్రజలంతా గర్వపడాలని కుటుంబాలను త్యాగం చేస్తూ 24 గంటలు పనిచేస్తున్నారని పోలీసు సేవలను కొనియాడారు ఈ సందర్భంగా సీఐ గోవర్ధణ గిరి మరియు ఎస్సైలు , కృష్ణయ్య, నర్సింగ్ రావును శాల్వతో సత్కరించి చేసే సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో గౌరవ కార్పొరేటర్స్ మరియు స్కూల్ హెడ్మాస్టరు మరియు కాలనీ ప్రజలు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని, , సురక్ష దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## శ్రీ వనమైసమ్మ వెంకట లచ్చమ్మ ప్రథమ వార్షికోత్సవం

**వార్షికోత్సవంలో పాల్గొన్న - మేయర్ జక్కా వెంకట్ రెడ్డి**



**పిర్జాదిగూడ, జూన్ 05 ( వాయిస్ టుడే):** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పర్వతాపురం ఐదవ డివిజన్ లోని రాంనగర్ కాలనీలో శ్రీ శ్రీ శ్రీ వనమైసమ్మ వెంకట్ లచ్చమ్మ దేవాలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా కాలనీ కమిటీ సభ్యుల మరియు స్థానిక కార్పొరేటర్ బొడిగె స్వాతి కృష్ణ గౌడ్ గారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పూజా కార్యక్రమనికి అమ్మవార్ల అభిషేక పూజ లో పాల్గొన్న గౌరవ మేయర్ శ్రీ జక్కా వెంకటరెడ్డి మరియు ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బైటింటి శారద ఈశ్వర్ రెడ్డి , కాలనీవాసులు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్య లొ పాల్గొన్నారు.

## ఘనంగా బాలానగర్ జోన్ పోలీసుల సురక్ష దినోత్సవం

### ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్...



**వాయిస్ టుడే - బాలానగర్:** తెలంగాణా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సురక్ష దినోత్సవాన్ని బాలానగర్ జోన్ పోలీసులు ఘనంగా నిర్వహించారు. పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హాజరైన కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారని, ఈ పదేళ్ల కాలంలో మనం సాధించిన ప్రగతిని ప్రజలకు తెలియపరిచే విధంగా ఈ దశాబ్ది ఉత్సవాలను జరుపుకుంటున్నా మని, అలాగే శాంతి భద్రతల విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. హైదరాబాద్ మహానగరంలో ప్రజలు ఎక్కడా ఎటు వంటి ఇబ్బంది లేకుండా ప్రశాంతమైన జీవనం గడుపుతున్నారని తెలిపారు. ఎవరికైనా ఆపద ఉందని సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే చర్యలు తీసుకుని తగిన పరిష్కారం చూపిస్తున్నారని, అంతే కాకుండా నిఘా కెమెరాల ద్వారా అనుక్షణం పర్యవేక్షిస్తూ ఎక్కడ ఎటువంటి తప్పిదాలు జరగకుండా చూస్తున్నారని ఇందుకు వారిని అభినందిస్తున్నానని ఎమ్మెల్యే కృష్ణారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు, ఏసీపీ గంగారాం, సీఐ కె. భాస్కర్, కూకట్ పల్లి ఏసీపీ చంద్రశేఖర్, జగద్గిరిగుట్ట సీఐ క్రాంతి కుమార్, సనత్ నగర్ సీఐ ముత్తు యాదవ్, ఎస్ఐ హరీష్, జీడిమెట్ల సీఐ పవన్ తదితరులు పాల్గొని సురక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
సోమవారం 5 జూన్ 2023

## సురక్ష దినోత్సవం సందర్భంగా జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిశీలించిన ఎమ్మెల్యే మాగంటి..



**జూబ్లీహిల్స్ జూన్ 4 (వాయిస్ టుడే):** జూబ్లీహిల్స్ శాసనసభ్యులు భారత రాష్ట్ర సమితి హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపినాథ్ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలలో సురక్ష దినోత్సవం పోలీస్ శాఖ కార్యక్రమంలో భాగంగా జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ ను సందర్శించడం జరిగింది .ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపినాథ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వర్యులు కేసీఆర్ శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టారని ఫ్రెండ్లీ పోలీస్ మరియు స్త్రీ భద్రత కోసం షి టీమ్ ఏర్పాటు చెయ్యడం ఆధునిక టెక్నాలజీ తో ఎటువంటి నేరం అయినా సులువుగా ఛేదించడం దేశంలోనే తెలంగాణ పోలీస్ ఒక రోల్ మోడల్ అని అన్నారు. ఎక్కడ కూడా కులమతాల గొడవలు కానీ రౌడీయిజం కానీ లేవని వాటిని పూర్తిగా అరికటిన పోలీస్ సిబ్బందికి ధన్యవాదాలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఏ సి పి శ్రీధర్, జిహెచ్ఎంసి డిసి రమేష్, ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, డి ఐ ప్రసాద్, సబ్ ఇన్స్పెక్టర్లు చంద్రశేఖర్, రాకేష్, రాజశేఖర్, గోవర్ధన్ రెడ్డి కార్పొరేటర్లు రాజకుమార్ పటేల్, దేదీప్య రావు, డివిజన్ అధ్యక్షులు సంజీవ, సంతోష్, కృష్ణమోహన్, నాయకులు విజయకుమార్, చిన్న రమేష్, నజీర్, విజయసింహ, సిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ కుటుంబాలకు 5 వేల చోప్పున అర్ధిక సహాయం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



**పెద్దపల్లి జిల్లా: (వాయిస్ టుడే న్యూస్) గోదావరిఖని:** ఇటివల అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ పాత్రికేయులు ఎలిగెటి శంకర్ కుటుంబాన్ని రామగుండం శాసనసభ్యులు కోరుకంటి చందర్ పరమర్శించి 5 వేల రూపాయలు అర్ధిక సహాయం అందించారు. అదే విధంగా 13 వ డివిజన్ కు చెందిన మహర్షి ల్యాబ్ లో పని చెస్తున్న సురేష్ ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరమర్శించి 5 వేల రూపాయలు ఆర్ధిక సహాయం అందించారు. అనారోగ్యం బాధపడుతున్న బషీర్, కలవెని మల్లేశ్ ను పరమర్శించి ఇద్దరికి 5 వెల చోప్పున సహాయం అందించారు. బండారి శంకర్ తండ్రి మృతిచెండటంతో శంకర్ ను, తోట సదానందం తల్లి మృతి చెందటంతో సదానందంను రాగటి మమత మామా మృతి చెందటంతో మమతను రాజేశ్వరరావు మృతి చెందటంతో ఆయన భార్య శ్యామలను, కొండ బాపును, బండారి శ్రీనివాస్ ఎమ్మెల్యే పరమర్శించారు. 13 వ డివిజన్ కు చెందిన దొడ్ల రవి కుమార్తె పెళ్లికి ఎమ్మెల్యే పుస్తె మట్టెలు అందిండటంతో వారు ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విజయమ్మ పౌండేషన్ ద్వారా శిక్షణ పోంది పోలీస్ సేలక్షన్స్ కానిస్టేబుల్ ఉద్యోగం పోందిన చుక్కల అనూష ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలుపగా . ఈ కార్యక్రమాల్లో కార్పోరేటర్ రాకం లత దామ్షెదర్ నాయకులు తోడేటి శంకర్ గౌడ్ బోడ్డు రవీందర్ నారాయణదాసు మారుతి ఉన్నారు.

## సదస్సును విజయవంతం చెయ్యండి



**పెద్దపెల్లి జిల్లా (వాయిస్ టుడే):** కరీంనగర్ లో రేపు జరుగు ఉమ్మడి జిల్లా సదస్సుకు మందకృష్ణ మాదిగ రాక రామగుండం నియోజకవర్గ మహాజన సోషలిస్టు పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక గోదావరిఖని గంగానగర్‌లో ఉపాధ్యక్షులు మడిపల్లి దశరథం మాదిగ అధ్యక్షతన జరగగా, ముఖ్య అతిథులుగా నియోజకవర్గ ఇన్చార్జి మంద రవికుమార్ మాదిగ హాజరై మాట్లాడుతూ రేపు అనగా 5..6..2023 కరీంనగర్ లో జరుగు ఎంఎస్పి ఉమ్మడి జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఇట్టి సదస్సుకు ముఖ్య అతిథులుగా గౌరవ మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని, ఎస్సీల వర్గీకరణ బిల్లుకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలని, లేనియెడల తెలంగాణలో బిజెపిని మట్టి కరిపిస్తామని, సమావేశంలో నాయకులు హెచ్చరించారు. ఇట్టి కార్యక్రమంలో ఎంఎస్పి అధికార ప్రతినిధి కాజీపేట రాజయ్య, ఉపాధ్యక్షులు గద్దల అనిల్ కుమార్, ఏలూరు రాంబాబు, ఆరేపల్లి శ్రీనివాస్, ఇప్ప మహేష్, సుద్దాల రమేష్, చిలుక ప్రమోద్, వడ్లూరు లింగస్వామి, ఇప్ప శీను, ముల్కల శ్రావణ్ కుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి జాతీయ కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర బిజెపి సహా ఇంచార్జి అరవింద్ మీనన్...!



**పెద్దపల్లి జిల్లా: (వాయిస్ టుడే న్యూస్):** గోదావరిఖని ఈరోజు పెద్దపల్లి జిల్లా కేంద్రం లోని జిల్లా బిజెపి కార్యాలయంలో బిజెపి జాతీయ కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర బిజెపి సహా ఇంచార్జి అరవింద్ మీనన్ నాయకులు కార్యకర్తలతో పార్టీ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు బిజెపి జిల్లా అధ్యక్షులు రావుల రాజేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ ,జిల్లా ఇంఛార్జి రావుల రాం నాథ్, పార్లమెంట్ కన్వీనర్ పి మల్లిఖార్జున్ బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.మామిడి రాజేష్ జిల్లా బిజెపి సీనియర్ నాయకుడు రామగుండం నియోజకవర్గం పెద్దపల్లి జిల్లా.

# జనాభా ప్రాతిపదికన రాజకీయ పార్టీలు బీసీలకు టికెట్లను కేటాయించాలి

### బిసిల రాజకీయ బాట" ను విజయవంతం చేయాలి

### బిసి సంక్షేమ సంఘము జాతీయ అధ్యక్షులు జాజుల



**భువనగిరి, జూన్ 4 (వాయిస్ టుడే ప్రతినిధి):** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో గల రహదారి బంగ్లా లో బీసీ సంక్షేమ సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ అధ్యక్షులు కొత్త నరసింహస్వామి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో.. ముఖ్యఅతిథిగా బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. అన్ని రాజకీయ పార్టీలు "బిసి డిక్లరేషన్" పేరుతో బిసి లను మోసం చేస్తున్నారని ఆయన అన్నారు. దేశంలో బిసిలు అత్యధికంగా ఉన్న రాష్ట్ర తెలంగాణ అని,సమగ్ర కుటుంబ సర్వే లెక్కల ప్రకారం 62% బిసి లు ఉన్నారని, ప్రభుత్వాలే చెబుతున్నాయని,62% ఉన్న బిసి లకు ఆయా పార్టీల నుండి జిల్లా కు ఎన్ని టికెట్లుఇస్తారని, ముఖ్యమంత్రి పీఠం ఎవరికీ ఇస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.119 అసెంబ్లీ స్థానాలు ఉండగా న్యాయ బద్దం గా బీసీలకు 60 సీట్లు, పార్లమెంట్ స్థానాలు 17 ఉండగా 9 కి పైగా ఇవ్వాలి కానీ అరశాతం ఉన్న బీసీలకు అసెంబ్లీ లో 21 మంది, పార్లమెంట్ లో 2 మాత్రమే ఉన్నారన్నారు. మరి మిగతా సీట్లు ఎక్కడ పోయినాయి? ఇదేనా సామాజిక న్యాయం? అని అయన ప్రశ్నించారు. ఇకనైనా మా వాటా తేల్చినాకే ఓట్ల కోసం రావాలని, లేనిచో,మా బిసి లు మీ కల్ల బొల్లి మాటలు నమ్మరన్నారు. బి ఆర్ ఎస్ పార్టీ నుండి సిట్టింగ్ లకే మల్లి టికెట్లు ఇస్తామంటున్నారు. సిట్టింగ్ లకు ఇవ్వటానికి ఇదేమైనా రాజరికం పాలనా,లేక ప్రజాస్వామ్య%శీ% కాదా ? అని అయన ప్రశ్నించారు. అలాగే సిట్టింగ్ లకు ఇస్తే మీ పుట్టి మునిగినట్టే అని అయన హెచ్చరించారు. పిడికెడు శాతం ఉన్నవారు అధికారంలో ఎలా ఉంటారని, పిడికెడు శాతం ఓటర్లు కావాలా, గంపేడు శాతం గా ఉన్న బిసి లు కావాలో, తేల్చుకోవాలని, హెచ్చరించారు.62% ఉన్న బిసి లను ఓటు యంత్రలుగా మాత్రమే చుస్తునారు అని అయన ఆవేదన వ్యక్తం చేశారు.బిసి లకు రాజకీయ అవగాహనా కల్పించటం కోసం నెలరోజుల పాటు ప్రతి పల్లె తిరిగి ఓ బిసి మెలోకో,నీ రాజ్యాని ఎలుకో.. అనే నినాదం తో ఓటు ప్రాధాన్యతను వివరిస్తామని, రాజకీయ పార్టీలు చేసే మోసలను వివరిస్తామని అన్నారు.ఈ కార్యక్రమం లో బిసి సంక్షేమ సంఘము యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు కొత్త నరసింహ స్వామి,బిసి ఉద్యోగాల సంఘము రాష్ట్ర కార్యదర్శి మాటూరి అశోక్, విద్యార్థి సంఘం జాతీయ నాయకులు తాటికొండ విక్రమ్ గౌడ్,ఉపేంద్ర చారీ,దేవరకొండ నర్సింహా చారీ,గూడూరు భాస్కర్, జాజుల లింగం గౌడ్,వంగరి లక్ష్మీనారాయణ,జాజుల భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణా సురక్ష దినోత్సవం

**వరంగల్ వాయిస్ టుడే:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో బాగంగా నేడు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేడు నిర్వహించిన తెలంగాణ సురక్షా దినోత్సవం సందర్భంగా వరంగల్ కమిషనరేట్ నుండి వరంగల్ తూర్పులోని ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్ ప్రాంగణంలో పెట్రో కార్,బ్లూ కోల్ట్స్ వాహనాల ప్రదర్శన నిర్వహించి, పోలీస్ కవాతు నిర్వహించారు ఈ కార్యక్రమంలో వరంగల్ సిపి ఏవి రంగనాథ్, కలెక్టర్ ప్రావీణ్య,ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, అడిషనల్ కలెక్టర్ అశ్విని,డీసీపీ భారీ,ఆర్డీవో మహేందర్ జీ,ఎనమాముల మార్కెట్ చేర్మెన్ దిడ్డి భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్ ,ఏసీపీ,సీఐలు,పోలీసు ఉన్నతాధికారులు,స్థానిక కార్పొరేటర్ తో పాటు వివిధ డివిజన్ల కార్పొరేటర్లు నాయకులు హాజరయ్యారు.

ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ వరంగల్ పోలీస్ కమీషనరేట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం మన వరంగల్ తూర్పులో నిర్వహించడం సంతోషకరం పోలీస్ అంటే ఇలా ఉండాలనే విదంగా గొప్పగా సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతున్న సీపీ ఏవి రంగనాథ్ గారికి కృతజ్ఞతలు.

- తెలంగాణ రాష్ట్రం సాదించుకున్నాక నాడు ఎట్లా ఉంది నేడు ఎట్లా ఉంది అనేది స్పష్టంగా కనపడుతుంది
- నాడు కేసీఆర్ నాయకత్వనా కోట్లాది తెచ్చుకున్న తెలంగాణలో ఎంత గొప్ప ప్రగతిని సాధించింది పోలీసు వ్యవస్థ ఎంత గొప్పగా మారింది అనేది మన కళ్ళముందు ఉంది
- తెలంగాణ సాధించే క్రమంలో పోలీస్ కృష్ణయ్య గారు అమరులయ్యారు
- పోలీస్ కృష్ణయ్యకు ఈ వేదిక ద్వారా నివాళులర్పిస్తున్నాం



- ఎంతో మంది త్యాగాల పునాదుల మీద తెలంగాణ వచ్చింది.
- గతంలో తెలంగాణ రాకముందు ఉన్న డొక్కు వాహనాలు,టెక్నాలజీతో పోలీసులు కేసులను ఛేదించాలంటే ఇబ్బందులు ఉండేవి
- నేడు తెలంగాణ వచ్చిన తరువాత మంచి వాహనాలు,గొప్ప టెక్నాలజీ,పోలీస్ ఆరోగ్య రక్షణ తో పాటు అన్ని రకాలుగా తెలంగాణ సర్కారు సహకరిస్తుంది
- తెలంగాణ ప్రభుత్వం పోలీసుల కోసం గొప్పగా పని చేస్తుంది
- సీపీ గారు వరంగల్ కమిషనరేట్ పరిధిలో కొత్త ఒరవడి చూపించి ససమస్య పరిష్కారం చూపుతున్నారు
- అత్యధిక గ్రీవెన్సు వరంగల్ కమిషనరేట్ లో ఉన్నాయి
- అందరిం కలిసి కట్టుగా పని చేస్తే గొప్పగా తెలంగాణ బాగుంటుంది. త్యాగాల పునాదుల మీద ఏర్పాటు అయ్యిన తెలంగాణ దొంగల పాలు కాకుండా భవిష్యత్తు తరాలకు అందించాలని కోరుకుంటున్నా

# ఆదర్శం జర్నలిస్టు కుటుంబం..!

### నేత్రాలు దానం చేసిన ఎలిగేటి శంకర్

### కుటుంబానికి సదాశయ అభినందన పత్రం

**పెద్దపెల్లి జిల్లా వాయిస్ టుడే న్యూస్ గోదావరిఖని, రామగుండం:** దుఃఖంలో కూడా సమాజ హితం కోసం కుటుంబ సభ్యుని నేత్రాలను దానం చేసి.. మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన సీనియర్ జర్నలిస్ట్ ఎలిగేటి శంకర్ కుటుంబం ఆదర్శనీయమని సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు, పలువురు ప్రతినిధులు కొనియాడారు. గత నెల 24న గోదావరిఖని విఠల్ నగర్ కు చెందిన ఎలిగేటి శంకర్ (55) అనే సీనియర్ జర్నలిస్ట్ అనారోగ్యంతో మృతి చెందాడు. మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించడానికి, ఎలిగేటి శంకర్ నేత్రాలను సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐ బ్యాంక్ కు దానం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం వారి నివాసంలో జరిగిన ఎలిగేటి శంకర్ సంస్మరణ సభ కార్యక్రమంలో కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభినందన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బొడ్డు రవీందర్, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు రాజమౌళి, కే. ఎస్.వాసు, అన్నపూర్ణ, జ్యోతి, మేజిక్ రాజా, మాటేటి శ్రీనివాస్, దామోదర్, శ్రీలత మాట్లాడారు. జర్నలిస్టు గా,



ఉపాధ్యాయునిగా, కళాకారుడిగా శంకర్ చేసిన సేవలను కొనియాడారు. నేత్రదానం మహదనమని అవగాహన కల్పించారు. అంధుల జీవితాల్లో వెలుగులు ప్రసాదించడానికి మరణానంతరం నేత్రదానం చేయడానికి అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యుడు ఎలిగేటి శంకర్ ను కోల్పోయిన దుఃఖంలో కూడా సమాజ హితం కోసం ఆయన నేత్రాలను చేయడానికి ముందుకు వచ్చిన నేత్రదాత భార్య వాణి, కుమార్ ప్రణయ్, కూతురు ప్రత్యూష, అల్లుడు సంతోష్, సోదరులు జనార్దన్, మల్లేశం, ఆనంద్, శ్రీనివాస్, అక్కలు, బావలు వరలక్ష్మి, నారాయణ, రాజేశ్వరి, రాజమౌళిని ఈ సందర్భంగా అభినందించారు.

# బర్మింగ్‌హామ్‌లో ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు

**హైదరాబాద్ సిటీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి):** యుగపురుషుడు, దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శతజయంతి వేడుకలను అమెరికా లోని బర్మింగ్‌హామ్‌లో ఇటీవల ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా కొంతమంది నిరాశ్రయులకు ఎన్టీఆర్ అభిమానులు భోజనం వండి వడ్డించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ నినాద మైన ఆత్మగౌరవం స్ఫూర్తిగా నిరుపేదలకు భోజనం, అవసరమైన వస్తువులను అందించడమే ఆయనకు మనం అందించే ఘనమైన, నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తి దేశవిదేశాలకు వెలుగులు నింపుతూనే ఉంటుందన్నారు. అమెరికాలో ఉన్న నిరాశ్ర యులను ఆదుకునేందుకు ఎన్టీఆర్ అభిమానులు ముందుకురావడం సంతోషంగా ఉందని జిమ్మీ హేల్ చారిటీ ప్రతినిధులు తెలిపారు.



### రాజశ్రీకి ఎన్టీఆర్ స్మారక పురస్కారం

**విజయవాడ కల్చరల్,జూన్ 4:** ఎన్టీఆర్ మహానటుడని, రాముడైనా, కృష్ణుడైనా ఏ పాత్ర అయినా ఆయన ధరిస్తేనే సముచితంగా ఉండేదని అలనాటి సినీ నటి రాజశ్రీ అన్నారు. తెలుగు కళా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హోటల్ ఐలాపురం కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం సాయంత్రం ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ స్మారక అవార్డును రాజశ్రీకి ప్రదానం చేశారు. అలాగే జానపద రాణి బిరుదుతో సత్కరించారు.

## రెవెన్యూ అధికారుల బదిలీలకు రంగం సిద్ధం

**హైదరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి):** ఎన్నికల విధుల్లో పాల్గొనే రెవెన్యూ అధికారుల బదిలీలకు రంగం సిద్ధమవుతోంది. త్వరలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కలెక్టర్ల నుంచి తహశీల్దార్ల వరకు బదిలీలు చేపట్టనున్నారు. అందులో భాగంగానే శనివారం మంత్రి హరీష్‌రావు అధ్యక్షతన డిప్యూటీ కలెక్టర్ల బదిలీలకు సంబంధించిన ప్రక్రియపై చర్చ జరిగింది. ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న వారికే కీలక పోస్టింగ్‌లు ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం తహశీల్దార్ల బదిలీలు కూడా పెద్ద ఎత్తున చేపట్టనున్నారు. కొన్ని జిల్లాల కలెక్టర్ల బదిలీలు కూడా జరగనున్నాయి.

## కోడి పందాల స్థావరంపై దాడులు

**వెంగళరావునగర్, జూన్ 4:** గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న కోడి పందాల స్థావరంపై వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం సాయంత్రం మెరుపు దాడులు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని యాదగిరినగర్‌లో ఉన్న ఓ ఇంటి మేడపై కోడికి కత్తులు కట్టి పందాలు నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఖలీల్ పాషా, ఎస్సై రంజిత్ కుమార్ వారి బృందంతో దాడులు చేశారు. కోడి పందాలను నడుపుతున్న నిర్వాహకులు బి.వెంకటయ్య, బి.సత్తిబాబుతోపాటు12 మంది పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. పట్టుపడ్డ వారినుంచి 10 పందెం కోళ్లు, 90 కోడి కత్తులు, రూ. 19,130 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు తదుపరి దర్యాప్తు నిమిత్తం మధురానగర్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

## రాష్ట్ర ప్రగతిపై చర్చ జరగాలి

**బడంగ్‌పేట, జూన్ 4:** దశాబ్ది ఉత్సవా ల సందర్భంగా తొమ్మిదేండ్లలో రాష్ట్రం సాధించిన ప్రగతిపై గ్రామాల్లో చర్చ జరిగేలా కార్యక్రమాలు నిర్వహించాలని విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఆదివారం మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఆర్‌సీఐ రోడ్డు నుంచి నందనవనం వరకు రోడ్డు విస్తరణ కోసం రూ. 1.20కోట్లు, రాఘవేందర్ నగర్ నుంచి గాయిత్రీనగర్ రోడ్డు విస్తరణ పనులు రూ. 65 లక్షలు, అంబేద్కర్ నగర్ నుంచి గ్రాయిత్రీనగర్ వరకు రోడ్డు విస్తరణకు రూ. 60లక్షలు, ఆటో స్టాండ్ నుంచి లైబ్రరీ వరకు రోడ్డు విస్తరణకు రూ. 85లక్షల పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. శంకుస్థాపన చేసిన పనులను వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారు లకు ఆదేశాలు జారీచేశారు. పనుల్లో నాణ్యత పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో జాప్యం చేస్తే సహించేది లేద న్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న ప్రధాన రహదారుల విస్తరణ పూర్తి కావస్తున్నాయన్నారు.

# కుల వృత్తులకు జీవం పోసింది కెసిఆర్ సర్కార్..

- తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలి
- ముదిరాజ్ కమ్యూనిటీ భవన నిర్మాణానికి 30లక్షల నిధులు..
- నిధులు మంజూరు పట్ల హర్షం వ్యక్తం చేసిన ముదిరాజ్ కులస్తులు
- 9యేండ్లలో కరీంనగర్ అన్నిరంగాల్లో అభివృద్ధి..
- మంత్రి గంగుల కమలాకర్
- ముదిరాజ్ ఆత్మగౌరవ భవనానికి నిధులు మంజూరు చేసిన మంత్రి గంగుల కమలాకర్‌ను సన్మానించిన ముదిరాజ్ కులస్తులు..



**కరీంనగర్, జూన్ 04 (వాయిస్ టుడే):** తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాలప్రజలు సంతోషంగా ఉండాలని.. కుల వృత్తులకు జీవం పోసింది కేసీఆర్ సర్కారే నాని బీసీ సంక్షేమ పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. రాంనగర్ లోని పెద్దమ్మ తల్లి దేవాలయాన్ని మంత్రి గంగుల కమలాకర్ దర్శించుకున్నారు.. అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి ముదిరాజ్ కులస్తుల విజ్ఞప్తి మేరకు 30 లక్షల రూపాయలునిధులు మంజూరు చేశారు.. తమ విజ్ఞప్తి మేరకు నిదుర మందులు చేసిన గంగుల కమలాకర్ గారిని ముదిరాజ్ కులస్తులు శాలువా కప్పి భారీ గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలని అన్ని కులాల ఆత్మగౌరవ భవనాలకు ప్రభుత్వ నిధులతో పాటు హైదరాబాద్ నడి బొడ్డులో ఖరీదైన స్థలాలు మంజూరు చేసిందని గుర్తు చేశారు... కరీంనగర్ రామ్ నగర్ లోని ముదిరాజ్ కులస్తుల ఆత్మగౌరవ భవనానికి 30 లక్షల నిధులు మంజూరు చేసినట్టు వెల్లడించారు... అన్ని వర్గాల ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.. భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు.. గత పాలకుల నిర్లక్ష్యంతో కరీంనగర్ అభివృద్ధిలో వెనుకబడిందని అన్నారు.. ఎక్కడ చూసినా గుంతల రోడ్లు అస్తవ్యస్తంగా మురికి కాలువలు దర్శనమిచ్చేయని అన్నారు..

9 ఏండ్ల తెలంగాణ పాలనలో కరీంనగర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని అన్నారు.. కరీంనగర్ లో ఎక్కడ చూసినా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని .. నగర ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని గుర్తు చేశారు.. కరీంనగర్ లో తీగల వంతెన ,మానేర్ రివర్ ఫ్రంట్ వంటి ప్రాజెక్టులతో పూర్తయితే .. కరీంనగర్ కు పర్యాటక శోభ సంతరించుకుంటుందని అన్నారు.. ఈ కార్యక్రమంలో కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డ వేణి మధు, గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్ గౌడ్, బారాస నగర అధ్యక్షులు చల్లా హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు పెంట సత్యం వరాల నారాయణ , నాయకులు కొట్టే మల్లేశం పలువురు ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కల్లూరి హరికృష్ణకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలి

### బిఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు సయ్యద్ ఖాజా మోహినుద్దీన్



**మెదక్ వాయిస్ టుడే న్యూస్:** మెదక్ జిల్లా ఎంపీపీలపోరం అధ్యక్షులు శివంపేట్ ఎంపీపీ కల్లూరు హరికృష్ణ జన్మదిన వేడు కలు జిల్లా నాయకులు ప్రజాప్రతిని ధుల సమక్షంలో ఘనంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు ఖాజా మొహీనుద్దిన్ మాట్లడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ఆపదన్న వారికి నేనున్నానంటూ వచ్చే ప్రజాప్రతి నిధి, ప్రజలలో నమ్మకం ఉన్నవాడు మన కల్లూరి హరికృష్ణ అని పేర్కొన్నారు కల్లూరి హరికృష్ణకు వచ్చే శాసనసభ ఎన్నికలలో ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు ప్రజలల్లో మంచి గుర్తింపు కలిగిన నాయకుడిగా, పేరు ప్రఖ్యాతులు ఉన్న గొప్ప నాయకుడిని వర్ణించారు. తప్పకుండా గెలిపించుకుందామని , గెలిచే సత్తా ఉన్న నాయకుడని కొనియాడారు. ఇందుకు గాను ముఖ్యమంత్రి కేసీఆర్ మా బీసీల ఎస్టి మైనార్టీల ముద్దుబిడ్డ కల్లూరి హరికృష్ణకు బిఆర్ఎస్ పార్టీ నుండి ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని కోరారు. హరికృష్ణ అన్న ఎమ్మెల్యే కావాలని ఎదురుచూస్తున్నారని ఎంపీపీ కల్లూరి హరీష్ అన్న వీర అభిమాని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ నాయకుడు సయ్యద్ ఖాజా మొహీనుద్దిన్ మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. ఈ కార్యక్రమంలో, బీసీ సంక్షేమ సంఘం నాయకులు, గడ్డం ప్రశాంత్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మహేష్ యాదవ్ , పైనమ్ సందీప్, శివ, శ్రవణ్, ఆంజనేయులు, హైమద్, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కనుల పండువగా ఆమ్మవారికి పల్లకి, ఉయ్యాల సేవలు, సహస్ర దీపారాధన



**కరీంనగర్ జూన్ 04 (వాయిస్ టుడే):** ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఆదివారం కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని పరివార సమేత దుర్గాభవానీ దేవాలయంలో దుర్గాభవానీ అమ్మవారికి వేద పండితులు పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు పవన్‌కృష్ణ శర్మ అమ్మవారికి విశేష హారతి, పూజ కార్యక్రమాలను కనుల పండువగా నిర్వహించారు. అమ్మవారికి పల్లకి సేవ, ఉయ్యాల సేవలతోపాటు సహస్ర దీపారాధన చేసారు. ఈ పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

## శిలాఫలకంపై జెడ్పి చైర్ పర్సన్ పేరు లేకపోవడం బాధాకరం

ఇది ముమ్మాటికి బహుజన మహిళలను అవమానించడమే

ఎమ్మెల్యే కావాలని చేసిన తప్పుకు అధికారులను బలి చేస్తారా??

ఎమ్మెల్యే హింసించే ఓ పులకేసి



**జగిత్యాల జిల్లా ప్రతినిధి (జూన్ 4)వాయిస్ టుడే:** జగిత్యాల ఎమ్మెల్యే కావాలని చేసిన తప్పుకు అధికారులను బాధ్యులను చేయడం సరికాదని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ బిజెపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ బోగశ్రావణి అన్నారు. ఆదివారం రోజు జరిగిన కేంద్ర గిడ్డంగుల - 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ కు ఫౌండేషన్ వేసే కార్యక్రమంలో ఏర్పాటుచేసిన శిలాఫలకంపై జడ్పీ చైర్ పర్సన్ పేరు తొలగించడం వెనక కుట్ర కోణం దాగి ఉందని శ్రావణి తెలిపారు. శిలాఫలకంపై బహుజన మహిళ అయిన జెడ్పి చైర్పర్సన్ పేరు లేకపోవడం మహిళలకు జరిగిన అన్యాయమని ఈరోజు జగిత్యాల మహిళలకు ఒక బ్లాక్ డే అని అభిప్రాయం వ్యక్తం చేశారు. జగిత్యాల ఎమ్మెల్యే ఒక హింసించే పులకేసి అని ఆయనకు బహుజనులు అంటే చులకన అని తీవ్ర స్వరంతో విరుచుకు పడ్డారు. ఎమ్మెల్యే బహుజనులను రాజకీయంగా ఎదగనీయరని ఆయనకు కేవలం సబ్బండ వర్గాల ఓట్లు మాత్రమే కావాలంటూ చురకలంటించారు. మున్సిపల్ చైర్ పర్సన్ గా ఉన్న తనను అభివృద్ధి కార్యక్రమాలు చేయకుండా అడ్డుకోవడంతో పాటు వేధించడం వల్లనే రాజీనామా చేసినట్లు తెలిపారు. రాజీనామా చేసి ఇప్పటికి నాలుగు నెలలు గడుస్తున్నా కౌన్సిల్ లో ఉన్న మిగితా 11 మంది బీసీ మహిళ కౌన్సెలోర్లను కాదని ఒక ఓసి సామాజిక వర్గానికి చెందిన వారికి చైర్మన్ గా బాధ్యతలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. రాజకీయ పబ్బం గడుపుకోవడానికే ఖాళీగా ఉన్న రూరల్ అర్బన్ ఎంపీపీ పదవులను కూడా రిజర్వేషన్లకు విరుద్ధంగా ఇతరులకు కట్టబెట్టారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బయట కనిపించే ఎమ్మెల్యే ఒక డాక్టర్ లోపల మరో యాక్టర్ ఉన్నాడంటూ ఎద్దేవా చేసారు. తరతరాలు ఉండే శిలా ఫలకాల పై పేరు లేకుండా చేయడం దారుణమని, కింది స్థాయి మహిళా నేతలు ఎమ్మెల్యే తీరుతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు . గతంలో అనేకమంది మహిళా అధికారులు మీ వల్ల కన్నీరు పెట్టుకుంది నిజం కాదా అంటూ ఎమ్మెల్యేను ప్రశ్నించారు. మహిళలను బహుజనులను ఎదుగనీయకుండా చేసి ఎమ్మెల్యే రాక్షసానందం పొందుతున్నాడని అన్నారు. ఒక మహిళా జిల్లా పాలనాధికారి ముందు జిల్లాస్థాయి ప్రోటోకాల్ ఉన్న బహుజన మహిళను అవమానించడం బాధాకరమని అన్నారు. మహిళలను అగౌరపరిచే ఎమ్మెల్యే కి మహిళా దినోత్సవం నిర్వహించే నైతిక హక్కు లేదు. జగిత్యాల ఎమ్మెల్యే వ్యక్తిత్వం మంత్రి కొప్పుల ఈశ్వర్ తో పాటు కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు ముందు ఈరోజు ప్రత్యక్షంగా బయటపడిందని విమర్శించారు. జిల్లాలో ఎక్కడ ప్రోటోకాల్ గొడవ జరగదు కేవలం జగిత్యాల నియోజకవర్గంలొనే జరుగుతుంది ఎందుకు? దానికి బాధ్యులు మీరు కదా అని ఎమ్మెల్యే ను ప్రశ్నించారు. నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే తీరును గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో ప్రజలు ఆయనకు తగిన బుద్ధి చెప్తారని శ్రావణి అన్నారు.

## నేరాలను అదుపు చేయడంలో అదునాతన టెక్నాలజీని ఆవలంబిస్తున్న పోలీసులు



**రఘునాథపల్లి, జూన్ 04, (వాయిస్ టుడే):** తెలంగాణ రాష్టం సిద్ధించాక నేరాలను అదుపు చేయడంలో పోలీసులు అధునాతన టెక్నాలజీని ఉపయోగించి నేరాలను కట్టడి చేయడం జరుగుతుందని జనగామ రూరల్ సిఐ సంతోష్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో తెలంగాణ రాష్ట్రం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సురక్ష దినోత్సవం సందర్భంగా ఎస్సై జాగర్ల రఘుపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిధిగా జనగామ రూరల్ సి ఐ సంతోష్ పాల్గొని మాట్లాడుతూ... ఆనాడు తెలంగాణ రాష్ట్రమిస్తే నక్సలైట్ల సమస్య అవుతుందని ఆంధ్ర పాలకులు తెలంగాణ స్వరాష్ట్రాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడం జరిగింది అని అయన అన్నారు. కానీ నేడు తెలంగాణ రాష్టం వచ్చి పది సంవత్సరాలు గడిచిన కూడా ఎక్కడ కూడా నక్సలైట్ల సమస్య లేదని అయన అన్నారు. స్వరాష్టం సిద్ధించాక పోలీసు వ్యవస్థలో అనేక సమూలమైన మార్పులు చేయడం జరిగింది అని అయన అన్నారు. అందులో భాగంగానే పోలీస్ వ్యవస్థను ప్రజల వద్దకు చేర్చేందుకై ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని తీసుకురావడం జరిగిందని అన్నారు. సమాజంలో మహిళలు తలెత్తుకొని తిరిగే విధంగా వారికీ ఎలాంటి అన్యాయం జరగకుండా షీ టీం ప్రత్యేక మహిళ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగింది అని అయన తెలిపారు. అదేవిదంగా సామాన్యుడు సైతం పోలీస్ స్టేషన్కు వస్తే అక్కడున్న రిసిప్షనిస్టు వారి బాధను తెలుసుకొని వారి ఫిర్యాదును స్వీకరించి రశీదును కూడా అందించి వారి కేసుకు సంబంధించిన సమాచారం తెలుసుకునే విధంగా ఆన్లైన్లో పొందుపరచడం జరుగుతుందని అయన తెలిపారు. సైబర్ మోసాల పట్ల ప్రజలను అప్రమత్తంగ ఉండి ఆన్లైన్ మోసాల బారిన పడకుండా1930 నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఏం మారుమూల ప్రాంతంలో ఎలాంటి సంఘటన జరిగిన బాధితులు 100 డయల్ కు కాల్ చేయగానే కొద్ది నిమిషాల్లోనే పోలీసులు అక్కడికి చేరుకొని నేరస్తులను అదుపులోకి తీసుకోవడం జరుగుతుందని అయన అయన తెలిపారు. సెల్ ఫోన్ దొంగతనాలను అరికట్టడానికి మొబైల్ ట్రాకింగ్ సిస్టం తీసుకురావడం జరిగింది అని అయన అన్నారు. గ్రామాల్లో జరిగే దొంగతనాలు అరికట్టడానికి గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని తద్వారా నేరాలు అదుపులోకి వచ్చే విధంగా పోలీసులు చర్యలు చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. అలాగే ప్రతి పోలీస్ స్టేషన్ లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి హైదరాబాదులో 650 కోట్లతో నూతనంగా ఏర్పాటుచేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా అనుసంధానం చేయడం జరిగింది అని అయన అన్నారు. తెలంగాణ రాష్ట ప్రజలకు పోలీసులు పారదర్శకంగా వ్యవహరించే విధంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరిగిందని ఆయన అన్నారు. యువత చెడు వ్యాసనాలకు బానిస కాకుండా గంజాయి తరలించే వారి పట్ల, సంఘ విద్రోహశక్తుల పట్ల అప్రమత్తంగ ఉండి పోలీసులకు సమాచారం అందించాలని అయన తెలిపారు. సమాజంలో జరుగుతున్న అనేక రకాలైన నేరాలను అదుపు చేయడంలో పోలీసులు నిర్విరామంగా శ్రమిస్తున్నారని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా జడ్పిటిసి ల ఫోరం అధ్యక్షుడు బొల్లం మణికంఠ (అజయ్ ) జనగామ జిల్లా సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు పోకల శివకుమార్,ఉప సర్పంచ్ యాద రాములు,పోరెడ్డి రాఘవ రెడ్డి,చీమలపాటి శ్రీనివాస్,శత్రశి రాములు గ్రామస్తులు పాల్గొన్నారు.

## గుడి స్థలం కబ్జాపై పోలీసుల విచారణ



**రఘునాథపల్లి, జూన్ 04, (వాయిస్ టుడే):** మండల కేంద్రంలోని హనుమకొండ, హైదరాబాద్ జాతీయ రహదారి అనుకోని సర్వే నెంబర్ 316 లో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ గుడి స్థలాన్ని కొంతమంది కలిసి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు అన్న ఆరోపణల నేపథ్యంలో జనగామ రూరల్ సిఐ సంతోష్, ఎస్సై జాగర్ల రఘుపతితో కలిసి ఆదివారం మండల కేంద్రంలోని గుడి వద్దకు చేరుకొని గ్రామస్తుల సమక్షంలో విచారణ చేపట్టారు. అనంతరం భూమి విక్రయించామని చెబుతున్న లింగాల జోగారెడ్డి వద్ద ఉన్న రిజిస్ట్రేషన్ డాక్యుమెంటును పరిశీలించారు. తదుపరి మిగతా ఆధారాలను సేకరించినందుకు విచారణ నిమిత్తం చిరు వ్యాపారులను సైతం పోలీసులు రమ్మని కోరడం జరిగింది. రిజిస్ట్రేషన్ పత్రాలను ఫోరెన్సిక్ సెంటర్ కు పంపించిన అనంతరం దానిపై వచ్చిన రిపోర్ట్ ఆధారంగా మిగతా వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు. అప్పటి వరకు వివాదాస్పద స్థలంలో ఎలాంటి కట్టడాలు చేపట్టరాదని పోలీసులు హెచ్చరించారు. ఈ విచారణలో జెడ్పిటిసి బొల్లం మణికంఠ(అజయ్), స్థానిక సర్పంచ్ పోకల శివకుమార్, ఉప సర్పంచ్ యాదరాములు, ఎల్లమ్మ ముత్యాలమ్మ టెంపుల్ సొసైటీ అధ్యక్షుడు పోరెడ్డి రాఘవరెడ్డి, శత్రాసి రాములు, చీమలపాటి శ్రీనివాస్, ఎం ఎస్ పి పార్టీ జనగామ జిల్లా కోఆర్డినేటర్ జేరిపోతుల సుధాకర్, బిర్రు మధు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## జక్లేర్ లో కరాటే గ్రేడింగ్ టెస్ట్



**మక్తల్ జూన్ 4 (వాయిస్ టుడే):** మక్తల్ మండలంలోని,జక్లేర్ గ్రామంలో కరాటే బెల్ట్ గ్రీడింగ్ టెస్టును సాలం మాస్టర్ గారి బృందం ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వచ్చి, రాబోయే తరాలకు కరాటేఅనేది ఒక నడవడికగా సాగాలని విద్యార్థులను ప్రోత్సహించి, కరాటే కిట్టుకై డబ్బులను అందజేసి,కరాటే విద్యార్థులకు కరాటే బెల్టులను మరియు కొత్తగా అయినటువంటి కరాటే విద్యార్థులకు బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్లనుఅందజేసిన. మక్తల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుల కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి మరియు సాలం మాస్టర్ ,అంబ్రేష్ మాస్టర్ ,శేఖర్ మాస్టర్ ,పూజారి పెద్ద మల్లేష్ ,వాకిటి లక్ష్మీనారాయణ ,సత్యసాయి హనుమంతు ,భగవంతు రఘు .చెట్టుకింద నరసింహులు నీరటి రంజిత్ వాకిటి అనిల్ ,జోగు బాలు ,ఇబ్రహీం ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు యువత నాయకుడి నుండి ఉమ్మడి జిల్లా డి సి యమ్ యస్ చైర్మెన్గా ఎదిగిన

# రైతు బిడ్డ డాక్టర్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి

గతంలో మండల ప్రజలతో కల్సి ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర చైర్మెన్‌దీ

జడ్పిటీసిగా, ఆలయం చైర్మెన్‌గా మండలం, పుణ్యక్షేత్రంకి ఎన్నో అభివృద్ధి పనులు...

తాను డాక్టర్ తన కుటుంభం డాక్టర్లు కానీ తాను ఎంచుకున్న బాట ప్రజా సేవ

ముఖ్యమంత్రి కెసిఆర్ మంత్రులు కేటీఆర్, ఈశ్వర్‌ల నమ్మినబంటు





**జగిత్యాల జిల్లా ప్రతినిధి (జూన్4,) వాయిస్ టుడే:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలలో బాగంగా జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని నర్సయ్యపల్లె గ్రామంలో రైతు దినోత్సవం కార్యక్రమానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లా డి సి యమ్ యస్ చైర్మెన్ డాక్టర్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి చైర్మెన్ ఎడ్ల బండి, ట్రాక్టర్ లతో ర్యాలీ గా రైతు వేదికకు చేరుకున్నారు. రైతు దినోత్సవ సంబరాలు ముగిసిన తర్వాత రైతన్నలు, మహిళ రైతులకు భోజనం వడ్డించి,రైతుల వారితో కలిసి పప్పన్నం సదాసిద భోజనం చేశారు. వారితో రైతులు కేసీఆర్ సారే మళ్ళీ రావాలి కేసిఆర్ సార్ సల్లగ ఉండాలని దీవించారు. అందరిలా కాకుండా తాను రైతులకు సేవ చేయాలనీ ఒక సంకల్పం బునినారు. చదివింది డాక్టర్ తన కుటుంబం లో తండ్రి ప్రభుత్వ డాక్టర్, అన్న వదినలు డాక్టర్ లు కానీ ముందు నుండి తన తల్లి రమాదేవి మేనమామ భాస్కర్ రెడ్డి లని ఆదర్శం గా తీసుకోని ప్రజాసేవ చేయాలనీ దృఢ సంకల్పం తో రైతు నాయకుడు గా ఎల్లవేళ్ళాల ఎల్లాల శ్రీకాంత్ అండగా ఉంటూ వస్తున్నారు. టీడీపీ పార్టీకి సంబందించిన తెలుగు యువత తో ప్రారంభించిన అయన రాజకీయ జీవితం అంచేలాంచెలుగా అతి చిన్న వయస్సులోనే యువత సహకారం తో భారీ మెజార్టీ తో ధర్మపురి మండలం జడ్పిటీసి గా గెలిచి చెరువు, గోదావరి అభివృద్ధి పనులు చేస్తూ మండల ప్రజలకు త్రాగు, సాగు నీరు ను అందించినారు. ధర్మపురి నృసింహ స్వామి ఆలయం చైర్మెన్ గా ముఖ్యమంత్రి కెసిఆర్ మంత్రి కేటీఆర్ మన్ననలను అందుకొని వారి సహాయ సహకారాలతో మంత్రి ఈశ్వర్ అండదండలతో బి ఆర్ యస్ నాయకులు, కార్యకర్తలతో మమ్మేకమై అటు పార్టీలో ఇటు ప్రజలలో మంచి నాయకత్వం కొనసాగిస్తూ రాష్ట నాయకులు గా అభిమానం పొందారు. పార్టీలో నమ్మకమైన, ఎదురులేని నాయకులుగా ముందుకు సాగారు. తదుపరి పి ఏ సి యస్ ధర్మపురి చేర్మెన్ గా, రైతులు ఎన్నుకున్న రైతు బిడ్డ రైతుల కష్టాలు తెలిసినా నాయకులుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా డి సి యమ్ యస్ చైర్మెన్ గా ఫోటో కాల్ ప్రజా ప్రతినిధిగా ఎన్నికైన్నారు. గత 20సంవత్సరాల పైబడి రైతుల కోసం, ప్రజల కోసం పోరాడుతూనే ఉన్నారు. ఈ రాజకీయ జీవితంలో ప్రజల, రైతుల మన్నల తో భవిష్యత్తు లో ఏమ్మెల్యే, ఎంపీ గా ఎదుగుతారని ప్రజలు చేర్చించుకుంటున్నారు.

# దేశ రక్షణకు సైనికులు ప్రజల రక్షణకు పోలీసుల నిరంతర కృషి

- శాంతిభద్రతలే కాదు సామాజిక సేవలో పోలీస్‌లు ప్రథమం
- పోలీసులు కరోనా కాలంలో సామాజిక బాధ్యతగా పనిచేశారు
- వారి సేవలకు నా సెల్యూట్.. మంత్రి గంగుల కమలాకర్



**కరీంనగర్, జూన్ 04 (వాయిస్ టుడే):** సమాజంలో శాంతి భద్రతలను పరిరక్షించడం తోపాటు, సామాజిక సేవలను అందించడంలోను తెలంగాణ పోలీస్ విభాగం ప్రథమంగా నిలిచిందని రాష్ట్ర బీసి సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ కొనియాడారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకలలో భాగంగా 3వ రోజు, జూన్ 4వ తేదిన జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన సురక్షా దినోత్సవం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, సిపి, చోప్పదండి ఎమ్మెల్యే లతో కలిసి రాష్ట్ర బీసి సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనాన్ని మంత్రి స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించుకొని 9 వసంతాలను పూర్తిచేసుకొని 10వ వసంతంలోకి అడుగిడుతున్న శుభసందర్భంగా అందరికి శుభాభివందనాలను తెలియజేశారు. దేశరక్షణ కోసం సైనికులు నిరంతరపోరాడితే, ప్రజల రక్షణ కొరకు పోలీసులు అహర్నిశలు కృషిచేస్తున్నారని, శాంతిభద్రతల పరిరక్షణ మాత్రమే కాకుండా సామాజిక సేవలోను విశేష సేవలందించి తెలంగాణ పోలీసులు దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచారని అన్నారు. పోలీసులు తమ కుంటంబాలను వదిలి, ప్రజల రక్షణ కొరకు నిరంతరం కృషిచేస్తూన్నారని, పోలీసుల పై నమ్మకంతో కంటి నిండా నిద్రపోతున్నారనిఅన్నారు. కరీంనగర్ లో అపహరణకు గురైన చంటిబిడ్డను రక్షించడం మొదలు ఆత్మహత్యలకు వెళ్లిన వారిని రక్షించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి తిరిగి ఇంటికి పంపిస్తున్నారని, పండుగల , ప్రత్యేకదినాల సందర్భంగా మద్యాన్ని సేవించి వాహనాలు నడిపే వారిని డ్రంక్ ఆండ్ డ్రైవ్ తో నిలువరించి ఎంతో మంది ప్రాణాలను కాపాడారన్నారు. సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కల్పించే వారిపై పిడి యాక్టలను అమలు చేయడం, దొంగతనాలు జరగకుండా నిలువరించడంతో పాటు తిరిగి మరోసారి అటువైపు వెళ్లకుండా కౌన్సిలింగ్ ఇస్తు సమాజ పరరక్షణలో బాగస్వాములవుతున్న పోలీసుల సేవలు చరిత్రలో నిలిచిపోతుందని కొనియాడారు. అదేవిధంగా ఆన్ లైన్ మోసాలు జరగకుండా సైబర్ క్రైమ్, మహిళారక్షణకు షి టీమ్స్‌తో ప్రజల్లో మరింత విశ్వాసాన్ని పెంపొందించగలిగారన్నారు. సమాజ సేవలోనే కాదు సమసమాజ స్థాపనలో మేమ సైతం అంటు కళాకారులతో చట్టాలపై అవగాహనను కల్పిస్తూ, నిరుద్యోగులకు ఉపాది భరోసాను కల్పించేలా బడాకంపనీలతో జాబ్ మేళాను నిర్వహించడం తో పాటు పర్యావరణ పరిరక్షణ, ఆకుపచ్చని తెలంగాణ రాష్ట్ర సాధన దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటడం, మియావాకి ప్లానిటేషన్ వంటివి చేపట్టి ప్రత్యేకస్థానాన్ని సంపాదించుకున్నారని అభినందించారు. మంత్రి ఈ సందర్భంగా ఉత్తమ సేవలను అందించిన పలువురు పోలీసులకు బహుమతులను అందించి అనంతరం మంత్రి పోలీసు వాహనాల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్.వి. కర్ణన్, సిపి సబ్బారాయుడు, చోప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, నగర మేయర్ వై. సునీల్ రావు, సుడా చైర్మన్ జేవి రామకృష్ణారావు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, ట్రైనీ కలెక్టర్ లెనిన్ వాత్సల్ టోప్పో,లా ఆండ్ ఆర్డర్ డిసిపి శ్రీనివాస్, ఏసీపీలు తుల శ్రీనివాసరావు, ప్రతాప్ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి టి వెంకన్న, ఇతర పోలీసు అధికారులు తదితరులు పాల్గోన్నారు.



## దశదినకర్మలకు హాజరైన ప్రభుత్వ విప్ రేగా

**అశ్వాపురం, జూన్ 4, (వాయిస్ టుడే న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోనితురుమల గూడెం గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ భూక్య కళ్యాణి మామ రిటైర్డ్ రైల్వే ఎంప్లాయ్ భూక్య భోజ్య ఇటీవల కొన్ని రోజుల క్రితం గుండెపోటుతో మరణించడంతో వారి నివాసానికి ఆదివారం ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే, బిఆంఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు వెళ్లి దశదినకర్మలకు హాజరై మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్, వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం, వెన్న అశోక్ కుమార్ కందుల కృష్ణార్జున, గోపిరెడ్డి, మేడవరపు సుధీర్, చందులాల్, సుంచు రామ్మూర్తి, ఎస్.కె నయీమ్, ఎండి జిలాని తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్ది ఉత్సవాల వాల్పోస్టర్ ఆవిష్కరించిన ప్రజా ప్రతినిధులు




**మెదక్ తూప్రాన్ వాయిస్ టుడే న్యూస్:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగ గజ్వేల్ నియోజకవర్గం తూప్రాన్ మున్సిపల్ పరిధిలో మరియు తూప్రాన్ మండల్ లో బిఆర్ టియు ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ల బాలరాజు యాదవ్ ముద్రించిన దశాబ్ది ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించిన తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రవీందర్ గౌడ్ 3వ వార్డు కౌన్సిలర్ బైరం ఉమా సత్య లింగం, బిఆర్ టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు యాదవ్, మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్పుల బాల్ రాజ్ దశాబ్ది ఉత్సవాల పోస్టర్ని ఆవిష్కరించారు .ఈ సందర్భంగా తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ రవీందర్ గౌడ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టినటువంటి సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవని అన్నారు ఒక ఆటో కార్మికుల ఐదు లక్షల ప్రమాద బీమా రోడ్ టాక్స్ మాఫిలాంటి ప్రవేశపెట్టి ఆటో డ్రైవర్ హక్కును చేర్చుకున్నారు అంతే కాకుండా అన్ని వర్గాలను అక్కున చేర్చుకున్న ఏకైక ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ గారు అలాగే రాబోయే రోజుల్లో దళితులకు దళిత బందు స్కీం ద్వారా 10 లక్షల రూపాయలు అలాగే గృహలక్ష్మి స్కీం కింద సొంత స్థానంలో ఇల్లు కట్టుకోవడానికి మూడు లక్షల రూపాయలు త్వరలోనే అర్హులైన ఆటో డ్రైవర్ కి ఇవ్వనున్నారు అనీ అన్నారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ మున్సిపల్ అధ్యక్షులు పర్స ప్రభాకర్ మాసాయిపేట్ మండల అధ్యక్షులు దుంపల అశోక్ మండల ప్రధాన కార్యదర్శి యాదగిరి తూప్రాన్ ఆటో స్టాండ్ అధ్యక్షులు బాలు, సుధాకర్, ప్రకాష్, మరియు అటో యూనియన్ నాయకులు డ్రైవర్లు పాల్గొన్నారు.

## ఉరేసుకుని గృహిణి ఆత్మహత్య



**వాయిస్ టుడే - బాలానగర్:** ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.జరిగింది. సీఐ కె. భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం రాజుకాలనీలో నివాసముంటున్న చొప్పదండి పవన్ వెంకటరాజు భార్య చొప్పదండి విజయ లక్ష్మి (38), గృహిణి. ఆమెకు ఇద్దరు సంతానం మానశ్రీ (13), విరాట్ తేజ్ హనుమాన్ (11) గలరు. స్థానిక మహిళలతో కూడి శ్రీ విద్యా పొదుపు సంఘం స్థాపించింది. సంఘానికి సంబంధించి నగదు తిరిగి బ్యాంక్ లో జమచేయలేని క్రమంలో మానసిక ఒత్తిడికి లోనై సమయానికి డబ్బులు సర్దుబాటు కాకపోవ డంతో ఆందోళనకు గురైన విజయ లక్ష్మి సాయంత్రం తన ఇంటి పై గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని, చున్నీ సాయంతో ఫ్యాన్ కు ఉరి వేసుకుంది. అనంతరం ఆమె కూతురు గది కిటికీలోకి చూడగా అప్పటికే ఆమె ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ హాస్పిటల్ కి తరలించారు. అక్కడి డ్యూటీ డాక్టర్ అప్పటికే ఆమె మరణించిందని ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బిఆర్ఎస్ బి. సి. సెల్ నాయకుడికి ఎంపీ పరామర్శ



**దుబ్బాక (వాయిస్ టుడే):** సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల కేంద్రంలోని మున్సిపల్ పరిధిలోని 14 వవార్డులోని బి ఆర్ ఎస్ మండల నాయకుడు ఎల్లారం చంద్రశేఖర్ గతవారం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద ఉన్న అతనిని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అతన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం నాడు దుబ్బాకలో సుడిగాలి పర్యటన చేశారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులో మాడవెల్లి లక్ష్మణ్ కుటుంబాన్ని 14వ వార్డులో ఎల్లారం చంద్రశేఖర్ ను 15వ వార్డులో వెంకట్రామిరెడ్డి కుటుంబాన్ని 20వ వార్డులో గోరిటాల ప్రసాద్. కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా ధర్మపేటలోని ఏసు రెడ్డి పితృ వియోగం కాగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఇట్టి కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ ఆస యాదగిరి. బత్తుల స్వామి కనకయ్య బాలకృష్ణ కో ఆప్షన్ మెంబెర్స్ స్వామి,రాష్ట్ర నాయకులు రొట్టె రాజమౌళి, జిల్లా నాయకులు గుండెల్లి ఎల్లారెడ్డి, గన్నే భూమి రెడ్డి, పల్లె రామస్వామి, నంద్యాల శ్రీకాంత్, శరన్ తేజ్, భూపాల్ ,పండు ,తదితరులు పాల్గొన్నారు...

### కుటుంబాన్ని పరామర్శించిన సోలిపేట సుజాత రామలింగారెడ్డి మరియు ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి.



**దుబ్బాక (వాయిస్ టుడే):** సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల కేంద్రంలోని మున్సిపల్ పరిధిలోని 13వ వార్డుకి కోదారి శ్రీకాంత్ తల్లి అనారోగ్యంతో చనిపోయిన విషయం తెలుసుకొని వారిని కుటుంబాన్ని పరామర్శించిన బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకురాలు సోలిపేట సుజాత రామలింగారెడ్డి గారు మెదక్ ఎంపీ పార్లమెంట్ సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి గారు మరియు వారితో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఆస స్వామి. సిద్దిపేట జిల్లా బిఆర్ఎస్ ఉపాధ్యక్షులు ఎల్లారెడ్డి, కౌన్సిలర్ ఆస యాదగిరి, బి ఆర్ ఎస్, సీనియర్ నాయకులు రొట్టె రాజమౌళి, భూమిరెడ్డి పాల్గొన్నారు.

## భువనగిరి లో పోలీసు సురక్ష దినోత్సవం"100 మీటర్ల జాతీయ జెండాతో జిల్లా కలెక్టర్ ఆఫీస్ వరకు ర్యాలీ



భువనగిరి,జూన్ 4 (వాయిస్ టుడే ప్రతినిధి):- తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా " సురక్ష దినోత్సవాన్ని " పురస్కరించుకొని పోలీస్,ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని టౌన్ పోలీస్ స్టేషన్ నుండి 100 మీటర్ల జాతీయ జెండాతో జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు పోలీస్,ఎక్సైజ్ శాఖ, సిబ్బంది తో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ,పోలీస్ అమరవీరుల కుటుంబాలకు జిల్లా కలెక్టరు,డి.సి పి,స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, డిసిపి రాజేష్ చంద్ర,స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ, ఎక్సైజ్ సూపరింటెడెంట్ నవీన్ కుమార్,జిల్లా యువజన,క్రీడల అధికారి ధనుంజయ్,కలెక్టరేట్ పరిపాలన అధికారి నాగేశ్వర చారి,పోలీస్ఎక్సైజ్ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మూడో రోజు సంరక్షణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కార్యక్రమం

**గీసుగొండ మండలం (వాయిస్ టుడే):** ఆదర్శ గ్రామమైన మరియపురంలో తెలంగాణ దశబ్ద ఉత్సవాలలో భాగంగా మూడోరోజు సంరక్షణ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని సిఐ సట్ల రాజు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సంరక్షణకు పోలీసుశాఖ వారు నిర్వహిస్తున్న డయల్ 100, సైబర్ క్రైమ్, బాలికల సంరక్షణ గురించి వారు వివరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్వేత సర్పంచ్ అల్లం బాలరెడ్డి ఎంపిటిసి ఉపసర్పంచ్ పాల్గొన్నారు.



## సమాజంలో ప్రతి ఒక్కరి హక్కుల కోసం కృషి

**మక్తల్ జూన్ 4 (వాయిస్ టుడే):** జిల్లా మానవ హక్కుల సంఘం నారాయణపేట యొక్క సర్వసభ్య సమావేశము రాయచూరు రోడ్డు నందలి కార్యాలయంలో నిర్వహించడం జరిగింది .ఇట్టి సమావేశంలో అధ్యక్షులు టి నాగరాజు మాట్లాడుతూ మన సంఘం ద్వారా సమాజంలో ఎన్నో రకాల సమస్యలు చెప్పుకోలేక సరైన న్యాయం జరగక మధ్యలోనే బలి అవుతున్నారు. అలాంటి వారి సమస్యలను పరిష్కరించడానికి సంఘం నిజాయితీగా పని చేయాలని తెలియజేశారు.సంఘం కార్యదర్శి డాక్టర్ శ్రీ రామ్ మాట్లాడుతూ. ప్రభుత్వ ఆస్పత్రులలో వివిధ కారణాలతో కాన్పులు నిర్వహించకుండా మహిళలను వేధిస్తున్న సంఘటనలు పరిశీలించి గర్భిణీ స్త్రీలకు సరైన న్యాయం చేయుటకు కృషి చేయాలని తెలియజేశారు కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్ రమేష్ రావు మాట్లాడుతూ మన పరిసరాల్లో అనునిత్యం జరిగే అన్యాయాలను పసిగట్టి న్యాయం చేయుటకు మానవ హక్కుల సంఘం జిల్లా కార్యవర్గము ముందుకు రావాలని అందరు సభ్యుల సహకారం ఎంత అవసరమని తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జైపాల్ రెడ్డి ,సహాయ కార్యదర్శి మామిళ్ల పృథ్వీరాజ్ ,సభ్యులు కట్ట వెంకటేష్, మహ్మద్ సాదిక్, కేశవరెడ్డి ,మహిళా ప్రతినిధులు అరుణ ,స్వప్న, సాదియా బేగం పాల్గొన్నారు.

## హలో రెడ్డి ఛలో కరీంనగర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



కరీంనగర్ జూన్ 04(వాయిస్ టుడే )రెడ్ల హక్కుల సాధనకై జూన్ 6 2023 నాడు కరీంనగర్లో అన్ని రెడ్డి ఉద్యమ సంఘాలను కలుపుకొని జిల్లా రెడ్డి ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న రెడ్ల ఆత్మీయ సమ్మేళనం హలో రెడ్డి చలో కరీంనగర్ కార్యక్రమానికి ప్రతి ఒక్క రెడ్డి బిడ్డ హాజరై విజయవంతం చేయాలని రెడ్డి ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు వంచ. సుదర్శన్ రెడ్డి కోరారు. ఈ ఆత్మీయ సమ్మేళన సమావేశం విజయవంతం సన్నాహక సమావేశాన్ని మెహెర్ నగర్- వివేకానందపురి లో నిర్వహించడం జరిగినది ఈ సందర్భంగా గోడ పత్రిక ఆవిష్కరించి రెడ్డి సంఘం నాయకులు మాట్లాడుతూ ఐదువేల కోట్లతో చట్టబద్ధత తో కూడిన రెడ్డి కార్పొరేషన్ ని తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు మరియు అర్హులైన పేద రెడ్డి విద్యార్థుల కోసం విదేశీ విద్యా నిధిని అందించడంతోపాటు 50 సంవత్సరాలు దాటిన ప్రతి రైతుకు 5000 పెన్షన్ ఇవ్వాలని ఐదు లక్షల వరకు ఆరోగ్య భద్రత కార్డును ప్రతి రైతుకు అందించాలని ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు సంధి తిరుపతిరెడ్డి, రోడ్డ లచ్చిరెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు చింతల శ్రీనివాసరెడ్డి కోస్న. వేణుగోపాల్ రెడ్డి కరీంనగర్ రెడ్డి సంఘం సీనియర్ నాయకులు బేతి మహేందర్ రెడ్డి వివేకానందపురి రెడ్డి సంఘం గౌరవ అధ్యక్షులు హనుమాన్ల శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షులు సుదిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రధాన కార్యదర్శి కొమ్మర శ్రీనివాస్ రెడ్డి ఉపాధ్యక్షులు కర్ర ప్రభాకర్ రెడ్డి కోశాధికారి కంకణాల శ్రీనివాసరెడ్డి కాసర్ల తిరుపతిరెడ్డి మరియు రెడ్డి సంఘాల నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## లలిత పరమేశ్వరి ఆలయంలో పంచమ వార్షికోత్సవం మహా అన్నదాన ప్రసాదం



**మెదక్ తూప్రాన్ వాయిస్ టుడే న్యూస్ :** మెదక్ జిల్లా తూప్రాన్ మండలం బంగ్లా వెంకట పురు శ్రీ లలితా పరమేశ్వరీ దేవీ ఆలయ పంచమ వార్షికోత్సవం ఆలయం ప్రాంగణంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి అభిషేకం, మహాపూజ 1022 వ చండీయాగం, మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకం , అమ్మవారి ఆశీస్సులతో జన్మించిన చిన్నారులకు తులాభారం తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం జరిగింది.అనంతరం తీర్థప్రసాద వితరణ, అన్నదానం కార్యక్రమం ఆలయం వ్యవస్థాపకులు, దేవీ ఉపాసకులు,సహస్ర యజ్ఞ స్వరాట్ బిరుదాకింతులు బ్రహ్మ శ్రీ సోమయాజుల రవీంద్ర శర్మ గారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

## జర్నలిస్ట్ అహోబిలం వెంకటేశ్వర్లను వారి కుటుంబాన్ని పరామర్శించిన మెదక్ ఎంపీ



**దుబ్బాక (వాయిస్ టుడే):** సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రామక్కపేటకు కు గ్రామానికి చెందిన జర్నలిస్టు అహోబిలం వెంకటేశ్వర్లు ఇటీవల చనిపోయిన విషయం తెలుసుకొని ఆదివారం వారిని. వారి కుటుంబాన్ని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి పరామర్శించారు. వీరితోపాటు ప్రజాప్రతినిధులు ఎంపీపీ కొత్త పుష్పలతో కిషన్ రెడ్డి పి ఏసి ఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్, బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు రొట్టె రాజమౌళి, డిసిసిబి డైరెక్టర్ బక్కి వెంకటయ్య గన్నె భూమిరెడ్డి పలువురు నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎల్లప్పుడు వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ స్థానిక ఎంపిటిసి సంగెపు శోభ స్వామి. ఉప సర్పంచ్ రంగు లక్ష్మీ రాజు. బి ఆర్ ఎస్ మండల నాయకులు. తుంకి సురేష్ సల్వేరి సల్వేరి రవి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు గ్రామ వార్డు సభ్యులు గ్రామస్తులు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



# భోళా మానియా మొదలు

చిరంజీవి హీరోగా మెహర్ రమేశ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'భోళాశంకర్'. తమన్నా కథానాయిక. చిరంజీవి సోదరిగా కీర్తిసురేశ్ కనిపించనున్నారు. సుశాంత్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ఆగస్టు 11న 'భోళా శంకర్' ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నెల 4న ఈ చిత్రం నుంచి తొలి పాటను విడుదల చేస్తున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం శుక్రవారం సాంగ్ ప్రోమోను విడుదల చేసింది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో చిరంజీవి స్టైలిష్ లుక్‌లో అలరించారు. రఘుబాబు, రావు రమేశ్, మురళీశర్మ ఇతర పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి మహతీ స్వరసాగర్ సంగీతం అందిస్తున్నారు. రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. ఈ నెలాఖరుకు చిత్రీకరణ పూర్తవుతుందని యూనిట్ తెలిపింది.

## మీ అందర్నీ మిస్సయ్యాను.. క్షమించండి

స్టార్ హీరోయిన్ రష్మికకు ఉన్న ఫాలోయింగ్ అందరికీ తెలిసిందే. ఈ నేషనల్ క్రష్‌ను ఇన్‌స్టాలో 38 మిలియన్ల మంది అనుసరిస్తున్నారు. తరచూ తన ఫొటోలు, మూవీ అప్‌డేట్‌లు పంచుకుంటూ సందడి చేసే రష్మిక ఇటీవల వారం రోజుల పాటు సైలెంట్ అయ్యింది. దీంతో ఫ్యాన్స్ అందరూ ఆమెను ట్యాగ్ చేస్తూ పోస్ట్‌లు పెట్టారు. తాజాగా ఇన్‌స్టాలో ఒక పోస్ట్ పెట్టిన ఆమె ఆన్‌లైన్‌లోకి రాకపోవడానికి గల కారణాన్ని చెప్పింది. అందర్నీ ఎంతో మిస్సయ్యానని తెలిపింది.

'రెయిన్ బో' షూటింగ్‌కు సంబంధించిన ఫొటోలను రష్మిక షేర్ చేసింది. "నెట్‌వర్క్‌లేని ప్రాంతంలో షూటింగ్ చేశాం. అందుకే ఆన్‌లైన్‌లోకి రాలేకపోయా. అప్‌డేట్స్ పంచుకోలేకపోయాను. క్షమించండి. మీ అందర్ని ఎంతో మిస్సయ్యాను. ప్రస్తుతం 'రెయిన్ బో' చిత్రీకరణలో బిజీగా ఉన్నా" అని రాసింది. మొదట కొన్నిరోజులు చెన్నైలో షూటింగ్ జరిగిందని.. ఆ తర్వాత మున్నార్, కొడైకెనాల్ ప్రాంతాలకు వెళ్లినట్లు చెప్పింది. అక్కడ సిగ్నల్ లేదని తెలిపింది. షూటింగ్‌ను చాలా ఎంజాయ్ చేశానని చెప్పింది. ఆహ్లాదకరమైన వాతావరణం మనసుకు ఉల్లాసాన్నిచ్చిందని పేర్కొంది. ఈ సెట్‌లో ఉన్నప్పుడే తన కుటుంబ సభ్యులు తనను చూడడానికి వచ్చారంటూ వాళ్ల ఫొటోలను షేర్ చేసింది.



రష్మిక



# ప్రాజెక్ట్ Kతో రికార్డులు పచ్చడి



నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న "ప్రాజెక్ట్ k"తో అన్ని రికార్డులు పచ్చడి అవుతాయని ప్రకటించారు ప్రముఖ నటుడు రానా. 2024 జనవరి 12న విడుదల కానున్న ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్ కీలక పాత్ర పోషిస్తుండగా... దీపిక పదుకొనె హీరోయిన్. ఈ చిత్రం "బాహుబలి, ఆర్.ఆర్.ఆర్" చిత్రాలు సాధించలేని ఎన్నో అద్భుతాలను అలవోకగా ఆవిష్కరిస్తుందని ప్రకటించిన రానా... ఇప్పటికే ఈ చిత్రంపై నెలకొన్న అంచనాలను మరింత పెంచేశాడు!!

## వంద కోట్లతో మోహన్ బాబు కొత్త సినిమా



టాలీవుడ్ సినిమా చరిత్రలో మోహన్ బాబుది ప్రత్యేక స్థానం. ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీలోకి వచ్చి నటుడిగా, నిర్మాతగా వందల సినిమాలు చేశాడంటే మాములు విషయం కాదు. ఆయన వల్ల ఇండస్ట్రీలోకి పరిచయమైన నటులు, దర్శకులు, టెక్నీషియన్లు ఎంతో మంది ఉన్నారు. ఇప్పుడంటే ఆయన సినిమాలు ఆడటం లేదు కానీ.. 80,90 దశకాల్లో ఆయన సినిమా రిలీజవుతుందే స్టార్ హీరోలు సైతం వాళ్ల సినిమాలను రిలీజ్ చేయాలంటే ఒకటికి పది సార్లు ఆలోచించేవారు. కలెక్షన్ కింగ్ అనే ట్యాగ్ నే సొంతం చేసుకున్నాడంటే అప్పట్లో ఆయన సినిమాలు ఏ రేంజ్ లో వసూళ్లు సాధించేవో అర్థం చేసుకోవచ్చు. మోహన్ బాబు అటు మాస్, ఇటు క్లాస్ ప్రేక్షకుల్లో తిరుగులేని అభిమానాన్ని సంపాదించుకున్నాడు. ఇలాంటి సమయంలో మోహన్ బాబు వంద కోట్ల సినిమాను ప్రకటించి అందరనీ షాక్ కు గురిచేశాడు. మా అధ్యక్షుడు విష్ణు నిర్మాణ సారథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతుందట. అంతేకాదు ఈ సినిమా ప్లాట్ ను కూడా మోహన్ బాబు ముందే చెప్పేయడం విశేషం. మోహన్ బాబు యూనివర్సిటీ, అక్కడి స్టూడెంట్స్ చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందట. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ వర్క్ కూడా స్టార్ట్ చేసినట్లు మోహన్ బాబు వెల్లడించాడు. మరీ ఈ సినిమా అయినా నటుడిగా మోహన్ బాబుకు, నిర్మాతగా విష్ణుకు కలిసి వస్తుందో లేదో చూడాలి.

## అంజనీపుత్రుడి ఆగమనం



రాముడి కథ చెప్పుకొంటున్నప్పుడు హనుమాన్ గాథని ప్రస్తావించకపోతే ఎలా? ఆంజనేయుడి ప్రస్తావన లేని రామాయణం అసంపూర్ణం. రామాయణం ఆధారంగా తెరకెక్కుతున్న 'ఆదిపురుష'లోనూ హనుమంతుడిది కీలక పాత్రే. ఈ పాత్రలో సన్నీ సింగర్ కనిపించనున్నారు. శుక్రవారం 'ఆదిపురుష్' నుంచి హనుమాన్ ఫస్ట్ లుక్‌ని చిత్రబృందం అధికారికంగా విడుదల చేస్తోంది. చేతిలో గద, గుండెల నిండా ధైర్యం నింపుకొని, శత్రు సంహారానికి దిగిన అంజనీపుత్రుడి లుక్ ఆకట్టుకొంది. ప్రభాస్, కృతి సనన్, సైఫ్ అలీఖాన్ ప్రధాన పాత్రలు పోషించారు. ఓం రౌత్ దర్శకుడు. ఈనెల 16న విడుదల అవుతోంది. తెలుగులో ఈ చిత్రాన్ని పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ విడుదల చేస్తోంది. ఈనెల 6న తిరుపతిలో ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ని నిర్వహించనున్నారు.



## దేశభక్తి ప్రధాన చిత్రంలో..

దాదాపు ఏడాది కాలంగా సినిమాలకు బ్రేక్ నిచ్చింది అగ్ర కథానాయిక సాయిపల్లవి. ఆమె శివకార్తికేయన్ సరసన నటిస్తున్న తాజా తమిళ చిత్రం గురువారం కశ్మీర్‌లో ప్రారంభమైంది. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్నారు. రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, సోని పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్ పతాకాలపై అగ్ర నటుడు కమల్‌హాసన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'దేశభక్తి ప్రధాన కథ ఇది. నాయకానాయికల పాత్రలు వైవిధ్యంగా ఉంటాయి. సాయిపల్లవి ఛాలెంజింగ్ రోల్‌లో కనిపిస్తుంది. కశ్మీర్‌లో రెండు నెలలు షూటింగ్ జరుపుతాం' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సి.హెచ్.సాయి, సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, రచన-దర్శకత్వం: రాజ్ కుమార్ పెరియసామి.

## కొత్త హీరోతో క్రైమ్ థ్రిల్లర్

BNK ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో ప్రొడక్షన్ నెం1గా రూపుదిద్దుకుంటోన్న చిత్రం గురువారం ప్రముఖుల సమక్షంలో పూజా కార్యక్రమాలతో గ్రాండ్‌గా ప్రారంభమైంది. మనోజ్ ఎల్లుమహంతి దర్శకత్వంలో రూపుదిద్దుకోనున్న ఈ చిత్రంతో ప్రదీప్ విరాజ్ హీరోగా ఇండస్ట్రీకి పరిచయం అవుతుండగా.. ఆయన సరసన దివ్య ఖుష్వా హీరోయిన్‌గా నటించనుంది. లవ్ అండ్ క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని బిఎన్‌కె (బంగారు నవీన్ కుమార్) భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్ర పూజా కార్యక్రమాలలో ముహూర్తపు సన్నివేశానికి సక్సెస్‌ఫుల్ నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా క్లాప్ కొట్టగా.. సీనియర్ దర్శకుడు వి. సముద్ర కెమెరా స్విచ్ఛాన్ చేశారు. బిజినెస్‌మ్యాన్ రామ్ ఎర్రమ్ స్క్రిప్ట్‌ని చిత్రయూనిట్‌కు అందించారు!!

